



# వార్త

ఆదివారం

21 జులై, 2024

# ఆషాఢ బోనం..
# అమ్మకు నీరాజనం



# తారాతీరం



## సాయి ధరమ్‌తేజ్, ఐశ్వర్యలక్ష్మి జంటగా..

సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ 'విరూపాక్ష' బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇక ఈ సినిమా తరువాత ఆయన సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా వాయిదా పడింది. కొత్త దర్శకుడు రోహిత్ దర్శకత్వంలో ఎస్‌డిటి18 సినిమాని ప్రకటించాడు సాయి ధరమ్ తేజ్. ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే మొదలైంది. ఈ సినిమా పీరియాడిక్ కథతో తెరకెక్కుతున్నట్లుగా తెలుస్తోంది. దీనిని తేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్ మూవీగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఐశ్వర్యలక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది

## డేరింగ్ గెటప్‌లో బెల్లంకొండ శ్రీనివాస్?

యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే ఆయన 'టైసన్ నాయుడు' అనే టైటిల్‌తో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం పూర్తి కాకముందే తన తరువాతి చిత్రాన్ని ఈ మధ్యే లాంచ్ చేశాడు. కౌశిక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ రెండు సినిమాలతో పాటు మరో ప్రాజెక్టుకు బెల్లంకొండ శ్రీనివాస్ ఓకే చెప్పినట్లు సమాచారం. కొత్త దర్శకుడు లుధీర్ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు బెల్లం కొండ శ్రీనివాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమా కొత్తగా ఉండబోతుందనీ, అందులో హీరో ఓ డేరింగ్ గెటప్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో బెల్లంకొండ అఘోర పాత్రలో నటించనున్నట్లు సమాచారం. దీనికి 'హైంధవ' టైటిల్ పెట్టాలని నిర్మాతలు భావిస్తున్నారు. ఈ చిత్రాన్ని చందు మహేష్, సాయి శశాంక్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



ఆదివారం వార్త
21 జులై, 2024

## మంచి ముత్యాలు

ప్రేమకు భయం అంటే ఏమిటో తెలియదు. ప్రేమయందు ఏవీ అడ్డురావు. భగవంతుడంటే ఎవరోకాదు, ప్రేమయే భగవంతుడు.

-స్వామి వివేకానంద

## విషయ విశేషం


లిక్విడ్ వాల్‌పేపర్... 4

'సంఘీ'భావం....5

సివిల్స్ అధికారుల శైలి వివాదాస్పదం

కవర్ స్టోరీ..6

ఆషాఢ బోనం..
అమ్మకు నీరాజనం

మీకు తెలుసా!...10

ఈవారం కవిత్వం..12

ఆ గది

అరకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి...14

తలపాగా వైభవం .....18

కథ.. 20

తొలగిన పొరలు

సాహిత్యం..23

తేనెలొలికే 'తెలింగీ' ఎక్కడుంది?

ఆహా! భలే గాజు వంతెనలు...26

జ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలి? ..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### 'ఒంటరి' భావన ప్రమాదమే

వృద్ధాప్యం అన్నది ఒంటరితనానికి పర్యాయ పదంగా మారుతోంది ఇప్పుడు. పిల్లలు ఏ విదేశాల్లోనో స్థిరపడటంతో తల్లిదండ్రులు ఏకాకిగా బతకడం మాత్రమే కాదు చుట్టూ అందరూ ఉన్నా తనకెవరూ ఆత్మీయులు లేరన్న భావన కూడా ఒంటరితనమే. ఈ తరహా బాధని సుదీర్ఘకాలం అనుభవించేవాళ్లలో పక్షవాతం.. గుండెపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయని హెచ్చరిస్తున్నారు శాస్త్రవేత్తలు. ఇందుకోసం 12వేలమంది వృద్ధుల్ని పరిశీలించారు హార్వర్డ్ టీహెచ్ చాన్‌స్కూల్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ పరిశోధకులు. 2006లో మొదటిసారి, 2018లో రెండోసారి వాళ్లతో ఇంటర్వ్యూలు చేసి ఆరోగ్య పరిస్థితుల్ని అంచనావేశారు. ఆ డేటా మొత్తాన్ని ఇటీవల విశ్లేషించారు. ఒంటరిగా ఉండటం కన్నా ఒంటరితనంలో ఉన్నామన్న భావనకి ప్రాధాన్యమిచ్చారు. తాము ఏకాకులం అన్న బాధ ఓ మోస్తరుగా ఉన్నవారిలో మిగతావారికన్నా 25శాతం గుండెపోటు ప్రమాదం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు.

**ఆటిజం మూలమేంటో తెలిసింది**

ప్రపంచంలోని ప్రతి 68మంది చిన్నారుల్లో ఒకరు ఆటిజం సమస్యతో బాధపడుతున్నారని ఓ అంచనా. ఎదుటివారి మాటల్నీ హావభావాల్నీ అర్థం చేసుకోలేకపోవడం, మేధోవికాసం లేకపోవడం, ఉద్వేగాల్ని అదుపుచేయలేకపోవడం..ఇలా అనేక సమస్యల్ని కలిపే ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డీ) అంటారు. ఈ సమస్యకి కారణాలని కనుక్కోవడంపైన పలు దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నా పెద్దగా ఫలితం లేదు. చీకట్లో చిరుదీపంలా గత ఏడాది ఓ చిన్న ముందడుగు పడింది. గర్భంలో ఉన్నప్పుడు ముఖ్యంగా తొలి త్రైమాసికంలో ఇతర శిశువులతో పోలిస్తే వీళ్లలో మెదడు ఎదుగుదల చాలావేగంగా ఉన్నట్టు గుర్తించారు. దాని నిరూపణ కోసం ఇటీవల ఓ సరికొత్త పరిశోధనకు దిగారు అమెరికాలోని క్యాలిఫోర్నియా వర్సిటీ (శాండీగో) శాస్త్రవేత్తలు. ఆటిజం చిన్నారుల, మామూలు పిల్లల రక్తనమూనాలని వేర్వేరుగా సేకరించారు. మామూలు పిల్లల రక్తనమూనాలతో పెరిగిన మెదడుకంటే, ఆటిజం పిల్లల మెదడు 40శాతం వేగంగా ఎదగడం గమనించారు. అక్కడితో ఆగలేదు ఈ వేగానికి మూలం మన శరీరంలోని 'ఎన్‌డెల్-1' అనే జన్యువులో ఏర్పడే లోపమేననీ తేల్చారు. ఆటిజం శోధనలో ఇదో పెద్ద ముందడుగని చెబుతున్నారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com





# లిక్విడ్ వాల్‌పేపర్








ఇంటికి సరికొత్త లుక్కును తీసుకురావాలంటే ఇది వరకు కాస్త కష్టమైన పనే. దానికి ఖర్చు, సమయమూ రెండూ ఎక్కువ పట్టేవి. కానీ క్షణాల్లో తెల్లటివాల్ పెయింటింగ్స్‌నీ హరివిల్లు రంగులతో అందంగా మలిచే వాల్‌పేపర్స్, మ్యూరల్స్ వచ్చాక ఆ పని చాలా తేలికైపోయింది. చిన్నచిన్న మార్పులతోనే ఇంటి రూపురేఖల్ని కొత్తగా చూపే వెసులుబాటు వచ్చేసింది. అయితే ఇప్పుడు అందులోనే మరింత సౌకర్యంతో పాటూ కొత్తవెరైటీల్నీ అందివ్వాలనుకున్న తయారీదారులు ఈ లిక్విడ్ వాల్‌పేపర్స్‌ను తీసుకొచ్చారు. లివింగ్‌రూమ్, కిచెన్, బెడ్‌రూమ్..ఇలా ఇంట్లోని గదులన్నింటిలో ఎంచుకున్న థీమ్‌కు నప్పేలా ఈ లిక్విడ్ వాల్‌పేపర్లనూ పెట్టుకోవచ్చు. ఆకట్టుకునే రంగులతో కనిపించడము కాదు, తాకితే మెత్తటి నునుపుదనంతో గోడలకు సరికొత్త లుక్కునూ తీసుకొస్తాయివి. అంతేకాదు, నచ్చిన ఆకారాల్లోనే వీటిని ఉంచుతూ గదికి ముచ్చటైన డెకరేషన్ చేయొచ్చు కూడా. త్రీడి బొమ్మలతో వచ్చే వాల్‌పేపర్స్‌ని గోడలకు అతికించడం తెలిసిందే. మరి ఈ లిక్విడ్ వాల్‌పేపర్ల సంగతేంటి అంటారేమో..సిల్క్, కాటన్ పదార్థాలతో తయారుచేసే ఈ వాల్‌పేపర్స్, మామూలుగా పొడిలా దొరుకుతాయి. దాన్ని నీళ్లతో కలిపి ముద్దలా చేసి ఆ తర్వాత కావాల్సిన చోట అతికిస్తారు. అంతే, గోడకు అదనపు అందాన్ని తీసుకొస్తూ ఈ వాల్‌పేపర్ ఇంటరియర్‌లో భాగమైపోతుంది.





'సంఘీ' భావం



# సివిల్స్ అధికారుల శైలి వివాదాస్పదం

కొందరు ఐపిఎస్, ఐఎఎస్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది. నిబంధనలను పక్కన పెట్టి అధికార పార్టీకి జీహుజూర్ అంటూ వ్యవహరించడం సివిల్స్ అధికారుల స్థాయిని దిగజారుస్తోంది. యుపిఎస్సి ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, కఠోరమైన రీతిలో ఉండే శిక్షణను పూర్తి చేసుకుని ప్రజాక్షేత్రంలోకి ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా బాధ్యతలు చేపడుతున్నారు. సామాన్య ప్రజలు వీరిని ఒకరకంగా ఆరాధిస్తారు. ప్రజలకు సేవలందించేందుకు ఈ రెండు హోదాలో అత్యున్నతమైనవిగా సమాజంలో గుర్తింపు పొందింది. అట్టడుగు వర్గాల ప్రజలకు, అనేక సమస్యలు ఎదుర్కొంటున్న గిరిజన ప్రాంతవాసులకు కొందరు ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు చేసిన సేవలు ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో కథలు, కథలుగా చెప్పుకుంటారు. కొన్ని సమస్యల పరిష్కారంలో కొందరు సివిల్స్ అధికారులు వ్యవహరించిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఒకసారి సివిల్స్ అధికారి హోదాలో నియమితులైతే వారు సర్వీసు పూర్తి చేసే వరకు తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించే అవకాశం ఉంటుంది. చాలా సందర్భాల్లో ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులను సైతం కొందరు అధికారులు విభేదించి నిబంధనలు వివరించి వారి దృక్పథాన్ని మార్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇవి వారిని సమాజంలో ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన వారిగా గుర్తింపు పొందారు. కలెక్టర్, ఎస్పీలు తమ ప్రాంతానికి వస్తే స్థానికులు తమ సమస్యలు చెప్పుకుని వాటిని పరిష్కరించుకునే వారు. జిల్లా స్థాయిలో జరిగే సమీక్షా సమావేశాల్లో కలెక్టర్లు, ఎస్పీలు కీలకంగా వ్యవహరించి ప్రజాప్రతినిధులకు మార్గదర్శకం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. తమకు లభించిన ప్రత్యేక అధికారాలను పక్కదారి పట్టిస్తున్నారు. ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు కొందరు ప్రజాప్రతినిధుల ఆశీస్సుల కోసం దాదాపుగా బరితెగించి వ్యవహరిస్తున్నారు. కొందరు సీనియర్ ఐఎఎస్‌లతో నిబంధనలను అతిక్రమించి పనులు చేయించుకోవడానికి ముఖ్యమంత్రులు సైతం వెనుకంజ వేసేవారు. ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంటోంది. కొందరు సివిల్ సర్వీసు అధికారులు తమ కర్తవ్యాన్ని విస్మరించి సమాజానికి చేటు కలిగే పనులు ముందుండి మరీ చేస్తున్నారు. గత కొంతకాలంగా పరిశీలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో కొందరు సివిల్స్ సర్వీసు అధికారులు వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. అధికారులు ఏ విధంగా ప్రవర్తించకూడదో వీరిని చూసి నేర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారపక్షం కొమ్ముకాసిన పలువురు అధికారులు ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోను, విభజిత రాష్ట్రాల్లోను న్యాయస్థానాల ముందు తలొంచుకుని నిలవాల్సిన పరిస్థితి దాపురించింది. సుమారు 15 మంది ఐఎఎస్ అధికారులు జైలులో కటకటాలు లెక్కించాల్సిన దుస్థితి కలిగింది. ప్రభుత్వాలు మారిన తరువాత తాము చేసిన అవినీతి అక్రమాలు ఎక్కడ బయటపడతాయో అని శెలవులపై వెళ్లిపోయే పరిస్థితులు కలుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు అవినీతి కేసుల నుంచి తప్పించుకుంటున్నారు. ఫైళ్లపై అధికారికంగా సంతకాలు చేసిన అధికారులు చట్టం ముందు దోషులుగా నిలబడుతున్నారు. ఈ విషయాన్ని ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు గ్రహించాలి. నిబంధనలను అతిక్రమించి రూపొందిన ఫైళ్లను క్లియర్ చేయడానికి అవకాశం లేదన్న విషయాన్ని ప్రజాప్రతినిధుల ముందు వెళ్లడి చేయాల్సిన అవసరం ఉంటుంది. అదేవిధంగా రాజకీయ కోణంతో జరిగే అరెస్టులు, నిర్బంధాల విషయంలో కూడా ఐపిఎస్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రాజకీయ నేతలు ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా మారిపోతూ ఉంటారు. ఒక పార్టీని తిట్టిపోసిన నేత పార్టీ ఫిరాయించి కాలర్ ఎగురవేస్తాడు. ఇలాంటి సందర్భాల్లో సివిల్ సర్వీసు అధికారుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. గత కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. సివిల్ సర్వీసు అధికారులకు ప్రజల్లో ఉన్న విశ్వసనీయత క్రమంగా తగ్గుముఖం పడుతోంది. రైతు తన భూమిని రాజకీయ నాయకుడు ఆక్రమించి తమను ఇబ్బంది పెడుతున్నాడని కలెక్టర్‌ను, ఎస్పీని ఆశ్రయిస్తే తాము ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. రాయలసీమ జిల్లాలో ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడంతో ఒక రైతు కుటుంబ సామూహిక ఆత్మహత్యలకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఒక రైతుకు న్యాయం చేయలేని దుస్థితిలో సివిల్స్ సర్వీసు అధికారులు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారంటే ఆ వ్యవస్థకే కాదు సమాజానికే చేటు చేస్తున్నట్లు గుర్తించాల్సి ఉంటుంది. శిక్షణ సమయంలో పొందిన తర్ఫీదు, వివిధ అంశాల పై పెంచుకున్న అవగాహనను మరింత సమర్థవంతంగా క్షేత్ర స్థాయిలో అమలుచేసేందుకు అధికారులు ముందుకు రావాలి. అధికారంలో ఉన్న పార్టీ ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలకు వెళ్ల వలసి ఉంటుంది. అయితే సివిల్ సర్వీసు అధికారులు ఒకసారి ఎంపికైతే వారు సర్వీసు పూర్తి అయ్యే వరకు కొనసాగే విధంగా స్పష్టమైన నిబంధనలు ఉంటాయి. కొందరు అధికారులు రాజకీయాలకు ఆకర్షితులై అవినీతికి పాల్పడి శాఖాపరమైన చర్యలకు గురౌతున్నారు. మరికొందరు జైలుకు వెళ్లాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం నడుచుకుంటే సర్వీసులో నిరుపేదలకు, సమాజానికి మేలు చేయడమే కాకుండా నిజాయితీ కలిగిన అధికారిగా గుర్తింపు పొందుతారు. ఆ దిశగా అధికారులు తమ వ్యవహారశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# ఆషాఢ బోనం.. అమ్మకు నీరాజనం

కవర్ స్టోరీ

పి.యస్.యమ్.లక్ష్మి



**ఆడపిల్ల ఇంటిని శోభాయమానం చేసే మహాలక్ష్మిగా భావిస్తారు. అందుకే పెళ్లయి అత్తగారింట్లో వున్నా, ఏ దూరతీరాల్లో వున్నా, పండగలకీ, ఉత్సవాలకీ ఇంటికి పిలిచి, ఉన్నంతలో పసుపు కుంకుమలు, చీరె, సారెపెట్టి పంపించే ఆచారం వున్నది. అలాంటి ఆచారాన్ని ప్రతిబింబించే మాసమే ఆషాఢమాసం. ఆ ఆషాఢమాసంలో ఇంటి ఆడబడచులతోబాటు, తాము కొలిచేగ్రామ దేవతలను తమ ఇంటి ఆడబడుచులుగా తలచి, ఆమెని పూజించి, భోజనం పెదట్టి, కానుకలు సమర్పిస్తారు.**

ఆషాఢ, శ్రావణమాసాలు వర్ష ఋతువులు. ఋతుమార్పుతో వచ్చే విషరోగాలబారి నుంచి తమని, తమ కుటుంబాలని రక్షించమని అమ్మవారిని వేడుకుంటారు. ఈ ఆషాఢమాసంలో గురు, ఆదివారాలలో ఈ ఉత్సవాలు ఘనంగా జరుపుతారు. ఈ సంవత్సరం ఆషాఢమాసం జులై 6వ తారీకు మొదలై ఆగస్టు 4వ తారీకుతో ముగుస్తుంది.

ఈ ఆషాఢమాసం ముఖ్యంగా తెలంగాణ వాసులకు, మరికొన్ని ప్రదేశాల వారికి అత్యంత పవిత్రమైన మాసం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమైన తర్వాత ఈ బోనాల పండుగని రాష్ట్రీయపండుగగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది వారాలపాటు సాగే ఈ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్ర దాయాలకు మచ్చుతునక. ఆసాఢమాసంలో దేవి తన పుట్టింటికి వస్తుందని నమ్మకం. అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తిశ్రద్ధలతోనేగాక, ప్రేమానురాగాలతో బోనాలను నైవేద్యంగా సమర్పిస్తారు. బోనాల పండుగ అనగానే తెలంగాణ ప్రాంతప్రజల మనస్సులు పులకరిస్తాయి. పురాణగాథలు, చారిత్రక సంఘటనలతో సంబంధం లేకుండా ఆయాప్రాంతాల ప్రజల బంధుమిత్రులు, కుటుంబాలతో కలిసిమెలసి ఈ పండుగ జరుపుకుంటారు. గ్రామీణ వాతావరణంలో నివసించే కుటుంబాల్లో బంధాలను, అనుబంధాలను పెంపొందించే వారధి బోనాలు. భాగ్యనగరవాసుల ప్రత్యేకపండుగగా ఇది సుప్రసిద్ధం. బోనాలు మహాకాళిని పూజించే హిందువుల పండుగ. నగరంలో ఆషాఢమాసంలో జరిగే బోనాలు గ్రామాల్లో శ్రావణమాసంలో జరుగుతాయి.

అమ్మవారికి సమర్పించే నైవేద్యాన్ని బోనం అంటారు. కొందరు బియ్యం, పాలు, బెల్లం కలిపి, కొందరు అన్నం, ఉల్లిపాయలతో కలిపి బోనాన్ని తయారుచేస్తారు. కొత్తమట్టి కుండను పసుపు, కుంకుమ, తెల్లరంగులతో అందంగా అలంకరిస్తారు. దానిలో బోనాన్ని పెట్టి, దానిమీద వేపాకుతో అలంకరించి, ఆపైన దీపం వెలిగిస్తారు. అందంగా అలంకరించుకుని, బంధుమిత్రులతో, ఇరుగుపొరుగుతో ఆ కుండలని నెత్తిమీద పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి బయల్దేరుతారు. మరి ఊరేగింపు అంటే కోలోహాలం కూడా వుండాలి కదా.

ఊరేగింపు ముందు డప్పుల వాయిద్యాలు, పోతురాజుల హడావిడి, వారిని చూసి దడుసుకుని చిన్నపిల్లలు, సందడికేం తక్కువ వుండదండి. ఆ సందడికి ఆ ఊరేగింపులో నడిచే కొందరు స్త్రీలకు పూనకం పడుతుంది. అంటే అమ్మవారు ఆవహిస్తుంది. వారు తలపై బోనాలని మోస్తూనే డబ్బులవాళ్ల లయబద్ధమైన శబ్దాలకు అనుగుణంగా దేవిని స్మరిస్తూ నర్తిస్తారు. మహంకాళి అంశ రౌద్రానికి చిహ్నం. అందుకే వాళ్లని శాంతపరచడానికి ఈ మహిళలు ఆలయం దగ్గరకు

వస్తున్న సమయంలో వారి ముందు మిగిలిన భక్తులు నీళ్లుపోస్తారు. కొందరు ఆపదలు వచ్చినప్పుడు తాము నమ్మిన అమ్మవారికి మొక్కుకుంటారు, ఆపద గట్టెక్కిస్తే బోనమెత్తు తామని. కొందరు ఆనవాయితీగా చేస్తారు. మహిళలు తెచ్చిన బోనాలని ఆలయంలో ఒకచోట కుప్పగా పోస్తారు. దానిమీద పసుపు, కుంకుమ జల్లి అమ్మకి నైవేద్యంపెట్టి, ముడుపులు చెల్లించుకుని, తమని చల్లగా కాపాడమని ప్రార్థిస్తారు. ఈ సందర్భంగా జంతుబలి కూడా వుంటుంది. ఇదివరకు దున్నపోతులని బలి ఇచ్చేవారుట. ఇప్పుడా ఆనవాయితీపోయింది. కోడిపుంజులని మాత్రం ఇస్తారు.



మరి భక్తులందరూ వస్తున్నప్పుడు ఆలయాలని మాత్రం అలంకరించద్దూ. ముందునుంచే ఆలయాధికారులు తమ నిర్వహణలో వున్న ఆలయాలను మరమ్మత్తులు చేయించి, రంగులు వేయించి, ఉత్సవాలకు సిద్ధం చేస్తారు. అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేస్తారు. ఆలయాలు వున్న వీధులన్నీ అందంగా అలంకరిస్తారు. జానపదశైలిలో ఉండే అమ్మవారి పాటలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా వుంటుంది. అమ్మని కొలవటానికి తండోపతండాలుగా వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు శ్రద్ధ తీసుకుంటారు. ఈ పండుగలో అనేకరకాల విశేషాలున్నాయి. అవేమిటంటే..

## తొట్టెలు



ఈ పండుగలో ఇంకా అనేక విశేషాలు వున్నాయి. భక్తులు అమ్మవారిని ఇంటి ఆడబిడ్డగా భావించి తొట్టెలో ఊగించి లాలించేందుకు తొట్టెను సమర్పిస్తారు. ఈ తొట్టె సమర్పణతో బాలారిష్టాలు పోతాయని, సంతాపం లేనివారికి సంతానం కలుగుతుందని విశ్వాసం. ఈ తొట్టెలను కర్రలు, రంగురంగుల కాయితాలతో అందంగా తయారు చేస్తారు. వీటిని కూడా ఊరేగింపుతో తీసుకువచ్చి అమ్మవారికి సమర్పిస్తారు.

## పోతురాజు

ఊరేగింపుకు అతి ముఖ్యమైన ఆకర్షణ ఊరేగింపుకు ముందు నడిచేపోతురాజు. ఈయనని అమ్మవారి సోదరుడంటారు.



ఇదివరకు కొంతమంది వంశాచారంగా, ఆనవాయితీగా పోతురాజు వేషంవేసేవారు. ఇప్పుడు అలాంటివారు చాలా తక్కువమంది వున్నా, ఔత్సాహికులు చాలామంది పోతురాజు వేషం వేస్తున్నారు. పోతురాజు పాత్రను పోషించే వ్యక్తి స్ఫురద్రూపిగా బలంగా ఉంటాడు. ఒంటిపై పసుపు పూసుకుని, నుదుటిపై పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుని, చిన్న ఎర్రని ధోవతిని ధరించి, కాలికి ఘల్లుఘల్లుమని మ్రోగే గజ్జెలు కట్టుకుని, డబ్బు వాయిద్యానికి అనుగుణంగా నాట్యం చేస్తాడు. ఒక్కొక్కసారి ఈయన పూజా కార్యక్రమాలకు ఆరంభకుడేకాదు, భక్త సమూహాలకి రక్షకుడు కూడా.

## విందులు, సంబరాలు

బోనాలు పండుగ దేవికి నైవేద్యం సమర్పించే పండుగ అవడంతో ఆ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు అతిథులతో పాటు స్వీకరిస్తారు. అమ్మవారికి బోనాలు సమర్పించిన తర్వాత ఇంట్లో బంధు మిత్రులతో మాంసాహార విందు భోజనం చేస్తారు.

## ఫలహారపు బళ్లు

బోనాల రోజు సాయంత్రం రకరకాల ఫలహారాలు బళ్లలో తీసుకువచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. ఈ ఊరేగింపులో కూడా ఫలహారపు బళ్లతో, పోతురాజుల విన్యాసాలతో, యువకుల నాట్యాలతో ఊరేగింపు ఉత్సాహంగా జరుగుతుంది.

## ఘటం

ఒక రాగి కలశాన్ని అలంకరించి దానిని అమ్మవారి ప్రతిరూపంగా భావిస్తారు. దానినే ఘటం అంటారు. ఈ ఘటాన్ని సాంప్రదాయమైన వస్త్రధారణతో, ఒంటికి పసుపు రాసుకున్న పూజారి నెత్తిన పెట్టుకుని తీసుకురాగా, పండగ మొదటి రోజు నుంచీ, చివరి రోజుదాకా ఆలయ పరిసర ప్రాంతాలలో రోజూ డప్పుల మేళాలతో ఊరేగిస్తారు. చివరి రోజున ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేస్తారు. ఈ ఊరేగింపులో పోతురాజుల కాక పౌరాణిక వేషాలు ధరించిన

ఉత్సాహవంతులు కూడా పాల్గొని ఊరేగింపుకి అందాన్ని తెస్తారు.



## రంగం

బోనాలు సమర్పించిన మరునాడు రంగం జరుగుతుంది. దీనిలో ఒక అవివాహిత అయిన స్త్రీ ఒక పచ్చి కుండమీద నుంచుని భవిష్యత్ గురించి చెబుతుంది. ఆ సమయంలో ఆవిడని అమ్మవారు ఆవహించి ఆవిడచేత భవిష్యత్ చెప్పిస్తారని భక్తుల నమ్మకం. భవిష్యత్ అంటే ఆసక్తి లేనిది ఎవరికి? అందుకే భక్తులు చాలా పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

**ఈ బోనాల సమర్పణకి కూడా కొన్ని నియమాలు వున్నాయి.**

## జంట నగరాలలో బోనాలు

ఈ బోనాలు ముందుగా గోల్కొండ కోటలోని జగదంబా మహాకాళి ఆలయంలోని అమ్మవారికి సమర్పిస్తారు. తర్వాతే మిగతా ఆలయాలలో.

## జగదంబా మహంకాళి ఆలయం, గోల్కొండ

ఈ ఆలయం 900 సంవత్సరాల క్రితం నుంచి వున్నది. అంటే గోల్కొండ కోట కట్టటానికన్నా ముందే ఈ ఆలయం వున్నది. ఈ ఆలయం గురించి రకరకాల కథలున్నాయి. పూర్వం ఈ కొండ మీద గొల్లవారు పశువులను మేపుకోవటానికి వచ్చేవారు. వాళ్లు కనుగొన్న ఆలయం ఇదని ఒక కథనం వున్నది.



ఇంకొక కథనం ప్రకారం కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఈ కొండ మీద మట్టికోట కట్టించేటప్పుడు అక్కడ అమ్మవారిని పూజించి బోనాల పండగ చేశారు. ఈ మట్టికోట గొల్లవాళ్లు పాలించేవారు. అప్పటినుంచీ దీనిని గొల్లకోట అనేవారనీ, అదే క్రమంగా గోల్కొండ అయిందంటారు.

అప్పటినుంచీ ఇక్కడ బోనాల ఉత్సవం నిర్వహిస్తున్నారు. అందువల్లనే కాబోలు అతి పురాతనమైన ఈ ఆలయంలో ముందుగా బోనాల ఉత్సవం ప్రారంభమవుతుంది. హిందూ, ముస్లింల సమైక్యతకు చిహ్నంగా, నిజాం సమయంలో జరిగిన బోనాల ఉత్సవాలలో ముస్లింలు కూడా సోదర భావంతో పాల్గొనేవారు.

రాష్ట్ర ప్రభుత్వం బోనాల సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేస్తారు. అలాగే ఈ ఆలయ కమిటీ తరపున జంట నగరాలలోని సికిందరాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి, లాల్‌దర్వాజా అమ్మవారికి, ఇంకా కొన్ని ఆలయాలలో అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందజేస్తారు. ప్రభుత్వ ప్రతినిధులు పట్టు వస్త్రాలు ఆలయ కమిటీకి అందజేసిన తర్వాత చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తీసుకువచ్చిన తొట్టెల ఊరేగింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు రాత్రి వరకు సాగుతుంది. ఈ ఉత్సవాలకు సమీపంలోనివారే కాక చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరవుతారు. అమ్మవారికి తొమ్మిది వారాల పాటు పూజలు నిర్వహిస్తారు. ఈ తొమ్మిది వారాలలో 3వ వారం ఉజ్జయినీ మహంకాళి బోనాలు, ఐదవ వారం లాల్ దర్వాజా అమ్మవారి బోనాలతో పాటు అన్ని ప్రాంతాలలో కూడా ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఈ ఆలయం ఇక్కడ చాలా కాలం పెద్ద ఆచ్ఛాదన లేకుండా వున్నదిట. ఇప్పుడు కూడా ఆలయం చిన్నదే. అయితే అనేక శతాబ్దాల నుండి పూజలందుకుంటున్న తల్లి మహిమలు మాత్రం అనంతమని ఆలయంలో బోనాలు సమర్పించే భక్తులను చూస్తే తెలుస్తుంది.

## ఉజ్జయిని మహంకాళి ఆలయం, సికిందరాబాద్

సికిందరాబాద్ జనరల్ బజారులో కిక్కిరిసిన దుకాణాల మధ్య వున్నది ఈ ఆలయం. మొదట్లో ఇక్కడ ఆలయం మాత్రమే ఉండేది.



తర్వాత తర్వాత జనావాసాలు పెరిగాయి. ఈ ఆలయం వెనుక ఒక చిన్న కథ వున్నది.

క్రీ.శ.1813లో సురిటి అప్పయ్య అనే ఆయన మిలటరీలో పని చేస్తూ ఈ ప్రాంతంలో ఉండేవారు. ఆయనకి ఉజ్జయిని బదిలీ అయితే అక్కడికి వెళ్లారు. ఒకసారి అక్కడ కలరా వ్యాధి తీవ్రంగా ప్రబలి, చాలామంది చనిపోసాగారు. అప్పుడు అప్పయ్య ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వెళ్లి ఆ తల్లికి మొక్కుకున్నారు కలరా తగ్గితే తన స్వంత ఊరులో అమ్మవారిలో ఆలయం నిర్మిస్తానని. కలరా తగ్గింది.

రెండు ఏళ్ల తర్వాత స్వస్థలానికి వచ్చిన అప్పయ్య దారుతో అమ్మవారి విగ్రహాన్ని చేయించి ఒక వేపచెట్టు కింద వుంచి పూజించసాగారు. తర్వాత చిన్న ఆలయం, ఆ తర్వాత ఆలయం విస్తీర్ణం చేసే సందర్భంలో తూర్పు వైపు వున్న బావిని మరమ్మత్తు చేయిస్తుంటే బావిలో మాణిక్యాంబ విగ్రహం దొరికింది. అమ్మవారి ఆనతి ప్రకారం అమ్మవారి విగ్రహం పక్కనే మాణిక్యాంబ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. క్రీ.శ.1864 సంవత్సరంలో సురటి అప్పయ్య సారధ్యంలో ఇదివరకున్న విగ్రహాల స్థానంలో ఇప్పుడున్న మూర్తులను ప్రతిష్ఠించారు. అప్పటినుంచీ ఇక్కడ శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరుగుతున్నాయి.

ఇక్కడ అమ్మవారు ఒక చేతిలో ఖడ్గంతో, మరో చేతిలో భరిణతో దర్శనమిస్తారు. పక్కనే మాణిక్యాంబ దర్శనమిస్తుంది. ముందు వున్న వేపచెట్టుని అలాగే వుంచి చుట్టూ ఆలయం నిర్మించారు. ఉపాలయంలో ఈశ్వరాంశ సంభూతుడైన వీరభద్రస్వామి చతుర్భుజాలతో ఎదురుగా నందీశ్వరుడితో సహా దర్శనమిస్తాడు.



గోల్కొండలో బోనాల ఉత్సవం మొదలయిన మూడవ ఆదివారం ఈ ఆలయంలోనూ, ఈ పరిసర ప్రాంతాలలోని వందకు పైగా ఆలయాలలోనూ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం ఫలహారం బళ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తాయి. మర్నాడు మహంకాళి, మాణిక్యాంబల చిత్రపటాలను ఏనుగు మీద ఊరేగిస్తారు. ఇక్కడ బోనాల మర్నాడు జరిగే రంగం చాలా ప్రసిద్ధి చెందింది. ఘటం ఊరేగింపు పరిసర ప్రాంతాలలో రోజుకొక వీధిలో జరుగుతుంది. తెలంగాణలో బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రీతిలో ఆ తల్లిని పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ, మహంకాళమ్మలుగా పూజిస్తారు. రూపం ఏదైనా భావమొక్కటే 'సల్లంగ మమ్ము సూడు తల్లీ' అని నిండు మనసుతో పూజిస్తారు. తెలంగాణ జీవితంలోని మాధుర్యాన్ని చవిచూపించే సాంస్కృతిక వేడుక ఈ బోనాల పండుగ.



**- ఫొటోలు: ఎస్.శ్రీధర్**

# అవసరానికి తగిన హెల్మెట్

హెల్మెట్ అనగానే..బైక్‌మీద వెళుతున్నప్పుడు రక్షణ కోసం పెట్టుకోవాల్సిన వస్తువే కదా అనుకుంటాం. కానీ వీటిల్లోనూ బోలెడన్ని రకాలున్నాయి. అందులో వర్షాకాలంలో ఉపయోగపడేది 'ఎలక్ట్రిక్ వైపర్ మోటర్‌సైకిల్ హెల్మెట్'. ఈ రీఛార్జబుల్ హెల్మెట్‌ని పెట్టుకుని వర్షంలో వెళ్లినా కంగారు పడక్కర్లేదు. ఎందుకంటే దాని మీదున్న చిన్న బటన్ నొక్కగానే, వైపర్-అద్దంపైన పడిన నీటిని చక్కగా శుభ్రం చేస్తుంది. కావాలంటే అవసరమైనప్పుడు మాత్రమే వైపర్ సెటప్‌ను ఉంచుకుని మామూలు సమయాల్లో తొలగించుకోవచ్చు. అంతేకాదు, ఇటాలియన్ మోటర్‌సైకిల్ హెల్మెట్ కంపెనీ ఎయిరో పేరుతో ఎయిర్‌బ్యాగ్ హెల్మెట్‌ను తయారు చేసింది.



ప్రమాదాలు జరిగినప్పుడు ఎయిర్‌బ్యాగ్స్ తెరచుకునేలా ఉంటుంది. ఇంకా రోజురోజుకీ పెరిగిపోతున్న కాలుష్యం వల్ల నగరాల్లో వాతావరణం పూర్తిగా మారిపోతుంది కదా. దాన్ని దృష్టిలో పెట్టుకునే ప్యూరిఫికేషన్ సిస్టమ్‌తో మన దగ్గరా రకరకాల స్టార్టప్ కంపెనీలు 'యాంటీ పొల్యూషన్ హెల్మెట్'లను తీసుకొస్తున్నాయి. ఏదిఏమైనా, రక్షణతోపాటు అదనపు ఉపయోగమూ ఉన్న ఈ వెరైటీ హెల్మెట్లు భలే ఉన్నాయి కదూ!



# మీకు తెలుసా!

## పుట్టగొడుగులతో కేన్సర్‌కు చెక్



మనదగ్గర పెద్దగా లేదుకానీ చైనా, జపనీయుల సంప్రదాయ వైద్యంలో పుట్టగొడుగులది కీలకపాత్ర. వాటి నుంచి తీసిన ద్రవాలు వ్యాధినిరోధక శక్తిని పెంచి కేన్సర్‌నీ నిలువరిస్తాయన్న నమ్మకం ఆ దేశాల్లో బాగా ఉంది. 2022లో భారతీయ పరిశోధకుడు ఎస్కే పాండాతో కలిసి బెల్జియన్ శాస్త్రవేత్తలు కొందరు వీటిపైన సమగ్ర అధ్యయనం ఒకటి నిర్వహించారు. ప్రపంచంలో వేల సంఖ్యలో పుట్టగొడుగులున్నా మనం తినగలిగేవి రెండువందల రకాలు మాత్రమే. వీటిలో పుట్టగొడుగులకి కేన్సర్ నిరోధక గుణాలున్నాయని వాళ్లు గుర్తించారు. వాటిల్లోని పాలీశాకరైడ్‌లూ, యాంటీఆక్సిడెంట్‌లూ ఆ మహమ్మారిపైన చక్కగా పోరాడగలవని తేల్చారు.

## వర్షాన్ని పసిగడుతుంది

ఈ కాలంలో ఇంట్లో నుంచి బయటకు అడుగుపెట్టామంటే తప్పనిసరిగా గొడుగు వెంట తీసుకెళ్లాల్సిందే. అయితే అది వర్షాన్ని ముందుగానే పసిగడితే..'స్మార్ట్ గొడుగు' అనొచ్చు. దీని హ్యాండిల్ లోపల ఒక చిప్ ఉంటుంది. ఇది ఆ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మొబైల్‌కు చేరవేస్తుంది. ఒకవేళ వర్షం పడేలా ఉంటే 15 నిమిషాల ముందుగానే మొబైల్‌కు నోటిఫికేషన్ పంపుతూ, గొడుగు వెంట తీసుకెళ్లమని సూచిస్తుంది. ఈదురు గాలులను సైతం తట్టుకునేలా ఈ గొడుగును డిజైన్ చేశారు.



## బట్టలు ఆరేందుకు

వర్షాకాలంలో బట్టలు ఆరడమంటే అంత ఆషామాషీ కాదు. అందుకే సేఫ్‌సైడ్‌గా 'క్లాస్ డ్రైయింగ్ స్టాండ్స్' వుంటే మంచిగా వీటిని బాల్కనీలో లేదా ఇంట్లోనే గాలి ఎక్కువగా ఉన్న చోట సులువుగా అమర్చుకోవచ్చు. బట్టలు ఆరిపోగానే ఫోల్డ్ చేసి ఒక పక్కన పెట్టుకోవచ్చు. ఈ స్టాండ్‌పై దుస్తులతో పాటు టవల్స్, బెడ్‌షీటు వంటివి కూడా ఆరేసుకోవచ్చు. వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా సులువుగా ఆరిపోతాయి.

## షూ డ్రైయర్స్



వర్షానికి షూస్ తడిస్తే ఓ పట్టాన ఆరవు. పైగా ముతకవాసన. ఈ సమస్యను పరిష్కరిస్తాయి 'షూ డ్రైయర్స్'. తడిసిన పాదరక్షలను ఇది క్షణాల్లో పొడిగా తయారుచేస్తుంది. ఇందులో రెండురకాల ఉష్ణోగ్రతలను అడ్జస్ట్ చేసుకునే వీలుంది.

షూరకాన్ని బట్టి ఆయా ఆప్షన్లను ఎంచుకోవాలి. అలాగే ఇందులోని ఓజోన్ సెరిలైజేషన్ మోడ్‌ను ఆన్ చేసుకున్నట్లయితే షూలోని సూక్ష్మజీవులు నశిస్తాయి. ఫలితంగా దుర్గంధం వ్యాపించదు.



# ఇంటికే వచ్చి వండేస్తారు

'**పుట్టినరోజు** వస్తోంది. బిర్యానీ, మంచురియా కాకుండా పిల్లలు ఇష్టపడే పాస్తా, బర్గర్, పిజ్జా ల్లాంటివి చేయించాలని ఉంది'. 'ఈసారి కిట్టిపార్టీ వంతు నాది. పదిమందికోసం వంటచేసే మనిషిని ఒక్కరోజులో ఎక్కడ వెతికి పట్టుకోవాలో' అంటూ ఆలోచించేవారికోసం ఇప్పుడు శిక్షణ పొందిన షెఫ్‌లు అందుబాటులో ఉన్నారు. ఒకరిద్దరి నుంచి ఎంతమంది కోసమైనా సరే కావాలనుకున్నప్పుడు ఇంటికొచ్చే ఈ పర్సనల్ షెఫ్‌లు కోరుతున్న వంటకాల్ని మన ఎదురుగానే వండి..హోటల్ స్టైల్‌లో అందంగా అమర్చి ఆశ్చర్యపరుస్తారు.



పది నుంచి పన్నెండు మంది ఫ్రెండ్స్‌ను ఇంటికి పిలుస్తాననీ..పార్టీలో చీజ్‌పాస్తా, చికెన్ లాలీపాప్స్, ఫ్రెంచ్‌ఫ్రైస్, మోమోస్ వంటివి కావాలనీ పట్టుబట్టాడు. వాటిని బయటి నుంచి తెప్పించొచ్చు కానీ ఎలాంటి నూనెలు వాడతారోననేది ఆ ఇంటి ఇల్లాలి భయం. పోనీ తనే చేయాలనుకున్నా సరిగ్గా కుదరకపోతే..పార్టీమూడ్‌పోతుంది కాబట్టి ఏం చేయాలబ్బా అనుకుంటున్నప్పుడు ఆమె కొలీగ్ ఓ నంబరు ఇచ్చింది కట్ చేస్తే..ఓ వ్యక్తి కావ్య ఇంటికొచ్చి రాహుల్ అడిగిన వంటకాలన్నీ చేసిపెట్టాడు. వంటవాళ్లు రావడంలో గొప్పేముందని అనుకోవచ్చు కానీ, కావ్య ఇంటికొచ్చింది శిక్షణ పొందిన షెఫ్. నిజానికి ఇప్పటికీ కేటరింగ్ సర్వీసెస్ ఉన్నాయి. కుక్స్ కూడా దొరుకుతున్నారు. ఆర్డరిచ్చిన పదార్థాలను ఇరవైనాలుగ్గంటలూ తెచ్చిచ్చే ఫుడ్‌సర్వీస్ ఆప్‌లూ లేకపోలేదు. వీటితో పోలిస్తే షెఫ్ ఇంటికి రావడంలో గొప్పేముందని అనిపించొచ్చు కానీ వీళ్ల స్టైలే వేరు. మన వంటింటినే లైవ్‌కిచెన్‌గా మార్చేసి..ఫైవ్‌స్టార్ హోటల్ స్థాయిలో వండిపెట్టడమే వీళ్ల ప్రత్యేకత.

కోరుకున్న వంటకాన్ని చేసేలా పెళ్లిరోజు, పిల్లల పుట్టినరోజు, ఫ్యామిలీ గెట్ టు గెదర్, కిట్టీపార్టీ, చిన్నపూజ, ప్రాజెక్ట్ సక్సెస్ కావడం..ఇలా ఈ రోజుల్లో అంతా కలిసి సరదాగా గడిపేందుకు బోలెడు అవకాశాలు. వాటన్నింటికోసం ప్రతిసారీ హోటల్‌కు వెళ్లాలంటే మాటలా అనుకునేవారు ఈ షెఫ్‌లను పిలిపించుకోవచ్చు. వీళ్లు ఒక వ్యక్తి నుంచి ఎంతమందికైనా వండిపెడతారు. అదేవిధంగా గంటకోసం వచ్చి ఒకటి రెండు వంటకాలు చేసిపెట్టడం నుంచి కొన్ని గంటల సమయం వరకూ ఉండి అడిగినవన్నీ వండేస్తారు. బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్.. దేనికైనా వీళ్లను పిలిపించుకోవచ్చు. వంటంతా పూర్తయ్యాక వంటింటి గట్టునూ శుభ్రం చేస్తారు. ఇక, వీళ్లు చేసే వంటకాల్లో దక్షిణాది/ ఉత్తరాది రుచులతోపాటు హైదరాబాదీ, మొఘలాయి, చైనీస్, కాంటినెంటల్, కొరియన్, మెక్సికన్..వంటివన్నీ ఉంటాయి. అలాగే సలాడ్లూ, స్టార్టర్లూ, బార్బెక్యూ, డెజర్ట్‌లూ, చాట్‌లూ, దోశలూ...ఇలా దేనయినా చేస్తూనే చాట్, దోశ, స్నాక్స్..లాంటివాటికి లైవ్ కౌంటర్‌లనూ పెడతారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, ఢిల్లీ..ఇలా దాదాపు అన్నిప్రాంతాల్లో అందుబాటులో ఉన్న సేవల్ని కూక్స్, షెఫ్ దర్బారీ, షెఫ్ హైర్, హోరాసర్వీస్..వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఇదంతా బానే ఉంది కానీ..వంటలకు సంబంధించిన పదార్థాలు, వండేందుకు అవసరమైన సామగ్రి ఎలా అనుకునేవారికి వాటినీ అందించే సంస్థలున్నాయి. ఒకవేళ పార్టీకి హాజరయ్యేవారి సంఖ్య ఎక్కువగా ఉంటే..వెయిటర్లనూ పిలిపించుకోవచ్చు. కూక్స్ సంస్థ అలాంటిదే మరి. మనం వండించుకునే వంటకాలు, పార్టీకి వచ్చే వ్యక్తుల సంఖ్య, కోరుకునే ఇతర సేవల్ని బట్టి..డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి..ఈసారి ఏదయినా పార్టీ పెట్టుకున్నప్పుడు మెనూ మీరు తయారు చేసుకుని వండే పని వీళ్లకు అప్పగించి చూడండి. హాయిగా అతిథులతో కబుర్లు చెబుతూ పార్టీని ఎంజాయ్ చేస్తూనే వెరైటీ వంటకాలను ఆస్వాదించొచ్చు.






# ఆ గది

అపోలోలా లేదు
ఉస్మానియా ఉప్పెనలా
కిక్కిరిసిన ఉక్కపోత.
వైద్యం ఖరీదు/ లక్షల చెమట ధారలు.
అదే ఏసీ గది./ జైలు గదిలా వుంది
ఒంటరితనం సంకెళ్లలో/ దిగులు బందిఖానా.
నిట్టూర్పుల వేడి/ సెగలా తగులుతోంది
వాడి పక్కనే కూర్చున్నాను
కబుర్లు రాశులుగా కుమ్మరించాను.
స్పష్టంగా అగుపిస్తోంది
నా చేతి కొసల నుండి వాడి గుండెల్లోకి
ధైర్య ప్రవాహం/ ఇది అచ్చొచ్చిన గది
త్వరలోనే కోలుకుంటాడు/ నా మాటలకు ఆమె

ఆ గది నాకు కొత్త ఏమీ కాదు
కొన్నాళ్ల క్రితం
నేనూ అక్కడే పడకేసాను
ఆమె కూడా/ ఇక్కడే కోలుకుంది
కరోనా పాడుకాలం/ కాలు బయట పెట్టలేం
మనుషులు లేరు... రోగులు తప్ప
పలకరింపులు లేవు/ రోగాలు తప్ప
తప్పని మౌన యుద్ధం
ఒకరినొకరం కాపాడుకున్నాం.
మళ్లీ ఇన్నాళ్లకు/ స్నేహితుడ్ని చూడ్డానికి.

కళ్లు తళుక్కుమన్నాయి
లేచి నుంచున్నాను. / నా అడుగుల వెంబడి
వాడి చూపులు నడుస్తున్నాయి
డోర్‌కి ఆవల నేను/ ఇవతలగా వాడి చూపులు
పక్క పేషెంట్ నిట్టూర్పులు
వెంటేసుకుని మెట్లు దిగాను.
ఈసారి
వాడి ఇంటికి వెళ్లాలి.

– తన్మయి

---

# కొత్త లోకం

**లోకం**
కొత్తగా కనిపిస్తుంది
కన్నులు
ఆర్పకుండా చూడాలనిపిస్తుంది.
లోకం
అందంగా అగుపడుతుంది
చూపును
తిప్పకుండా కాంచాలనిపిస్తుంది.
లోకం
వింతగా దర్శనమిస్తుంది
దృశ్యాలు
తన్మయత్వాన్ని కలిగిస్తున్నాయి.
లోకం
రంగులను చిమ్ముతుంది
కాంతులు
చుట్టూ వ్యాపిస్తున్నాయి.
లోకం
ఆశ్చర్యం కలిగిస్తుంది
మనసు
ముచ్చట పడుతుంది.
లోకం
అద్భుతంగా తోస్తుంది
కొండాకోనలు
కళ్లను కట్టిపడేస్తున్నాయి.
లోకం
అంతరంగాన్ని తట్టుతుంది
అందాలను
వీక్షించమంటుంది.
లోకం
మదిని ముట్టుతుంది
ఆనందాలను
ఆస్వాదించమంటుంది.
కంటికి
చికిత్స జరిగింది
లోకం
పూర్తిగా మారిపోయింది.
లోకం
నా వైపే చూస్తుంది
ఏలనో
నన్నే ప్రేరేపిస్తుంది.
కవనలోకం
రమ్మని పిలుస్తుంది
కవిత్వం
కమ్మగా కూర్చమంటుంది.

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్



## సినిమా టాక్స్



వర్తమాన జీవనంలో సినిమా ఒక 'తప్పని సరి' భాగమయింది. పేద, ధనిక వర్గాల తారతమ్యం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా అందరి ఆదరణకు సినిమా నోచుకుంటున్నది. సినిమా తీయటం అన్నది కళాపోషణయా? లేక వ్యాపారాత్మకమా? అన్న ప్రశ్న ఉదయించినపుడు నేటి ట్రెండ్ గమనించితే, అది తప్పక పరిశ్రమ (ఇండస్ట్రీ) అనుకోవాల్సి వస్తున్నది. 99శాతం ఈ వర్గానికి చెందిన వారైతే.. 1శాతం మాత్రం ఇందుకు భిన్నం అని చెప్పుకోవాలి. ఆధునిక చిత్రపరిశ్రమ విలువ 11000 బిలియన్లు. భారతదేశంలో 2023 నాటికి 1184 బిలియన్ల రూపాయలు, 1913లో ప్రారంభించబడిన దేశ సినీపరిశ్రమ ప్రపంచంలోనే రెండవదట. ఇంతటి ప్రజాదరణ పొందిన సినీ పరిశ్రమ గురించి ముఖ్యంగా మనదేశసినీ చరిత్ర గురించి ఆప్కారి సూర్యప్రకాశ్ లోగడ కొన్ని వ్యాసాలను వివిధ పత్రికలలో ప్రకటించారు. ఆ వ్యాస సంకలనమే 'సినిమా టాకీస్'. ఇందులో 33 వ్యాసాలున్నాయి. సినిమాల్లో రచయిత, దర్శక నటుల పాత్ర, సినిమా పరిభాష, వ్యాకరణం, భారతదేశంలోని పేరెన్నికగన్న చిత్రాలు, ముఖ్యంగా తెలుగు భాషలో పేరొందిన నటీనటులు, వారి వివరాలు ఇచ్చారు. కొన్నాళ్ళ క్రితం వంశీకృష్ణ అనే రచయిత, విశ్లేషకుడు 'సినిమా చదవటం ఎలా?' అన్న గ్రంధం వెలువరించారు. సావిత్రి, నాగేశ్వరరావు, రామారావుల పరిచయాలు, ముఖ్యంగా ఈ రచయితకు ఆప్తుడైన దాశరధి పరిచయం పాఠకుల మనసులను ఆకట్టుకుంటుంది. **(సినిమా టాకీస్, రచన: ఆప్కారి సూర్యప్రకాశ్, వెల: రూ 220, ప్రతులకు: ప్రముఖ అన్ని బుక్‌హౌసులు)**

**- కూర చిదంబరం**

## గొప్ప కవిత్వం..అద్భుత అనువాదం



'ఈసారి మనిషో మృగమో/ తన శవమో/ ఎరుపెక్కిన గాయాలతో/ ఊళ్లోకి.. ప్రవేశిస్తోంది పులి' యిది జాతీయ పురస్కార సినీదర్శకులు, కవి శీను రామసామి తమిళ కవితకు తెలుగు అనువాదం. అనువాదకులుజిల్లేళ్ళ బాలాజీ. ఈయన కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత. దాదాపు 200 తెలుగు అనువాద కవితల బృహద్గ్రంథం 'ఫిర్యాదు పెట్టెపై నిద్రిస్తున్న పిల్లి'. 'వర్షం ఆగిపోయింది/ ఎదురు చూసిన నగరపు వాసి/ బయటపడ్డాడు/ వర్షం ఆగిపోయింది/ వ్యవసాయదారుడు తలపైకెత్తి/ ఆకాశం కేసి చూశాడు/ ఎవరెవరికి వాళ్లవాళ్ల..వర్షం' వర్షం ఆగిపోవాలని ఒకరు.. కురవాలని మరొకరు.. ఎవరి ఆతృత వారిది. 'వెనక నడిచే కాలంలో/ ముందుకు వెళ్లడానికి/ ముందుకు వెళ్లేకాలంలో/ వెనకబడటం/ ప్రయాణంలో చేరని..బట్టి అలసట' తాత్విక కత చిప్పిరిల్లిన జీవితసత్యం. 'ఆకలేస్తే తానుగా తింటుంది/ ఆకలి లేని బిడ్డేమో/ తాగిపిస్తే కక్కుతుంది/ తాగిపించే వేలును కొరుకుతుంది/ దేన్నైనా వెతుక్కుంటూ వెళ్లి ఇవ్వకు/ వెతుకుతున్న వాడికి ఇవ్వు' అపాత్రదానం పనికిరాదు. only Deserving should be helped. 'ఆకు కూరలిచ్చి తాకి నమస్కరించే/ వయో వృద్ధులను తలెత్తి చూసింది/ మార్కెట్టు ఆవు' కవితలోని క్లుప్తత. ఆర్ద్రత పాఠకుల్ని కట్టిపడేస్తాయి. బాలాజీ రచనాశైలి అనువాదంలా తోచదు. గొప్ప అనుభూతినిచ్చే అనువాద కవితా సంపుటి యిది. **(ఫిర్యాదు పెట్టెపై నిద్రిస్తున్న పిల్లి, రచన: శీను రామసామి, అనువాదం: జిల్లేళ్ళ బాలాజీ, వెల: రూ 250, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**- రమణ వెలమకన్ని**

## అందాయి

➤ నందమూరి రామా! నతులు మీకు!
రచన: టి.శాంతాభాస్కర్, వెల: అమూల్యం, ప్రతులకు: లోకేష్ ప్రచురణలు, నెం.2-711/2, షాహుకార్ బంగ్లావీధి, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు.

➤ ఓబీసీలకు అంబేద్కర్ కాంట్రిబ్యూషన్, రచన: బి.ఎస్.రాములు, నిర్వహణ: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్.

➤ శ్రీనందమూరి తారకరామ శతకము
కవి: పాణ్యం దత్తశర్మ, వెల: రూ 50, ప్రతులకు: 5-4-48/1, ప్లాట్-20, రోడ్‌నం.1, ఆంధ్రకేసరినగర్, వనస్థలిపురం, హైదరాబాద్.

➤ విరి కేదారం
రచన: చిలకమర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, వెల: రూ 150, ప్రతులకు: చిలకమర్తి రాజ్యలక్ష్మి, ఆంధ్రాబ్యాంకు వీధి, దేవిడి దగ్గర, నరసాపురం, ప.గో.జిల్లా.

➤ ఫైట్ ఫర్ పీస్ అండ్ స్ట్రగుల్ ఫర్ యన్ ఐడియల్ సొసైటీ, రచన: ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, ప్రతులకు: సాధు సుబ్రహ్మణ్యశర్మ, 69-3-4ఎఫ్, ఐ.కె.రోడ్డులైన్-3, రాజేంద్రనగర్, కాకినాడ.

## లాక్డౌన్ వ్యతల 'నీడ'



తెలంగాణ పబ్లికేషన్స్ ద్వారా ప్రచురణైన 'నీడ' కథల సంపుటి వెలువరించారు ప్రముఖ కథా, నవలా రచయిత సలీం. ఇందులో 17 కథలున్నాయి. నీడ, బాకీ, దగ్ధం, దృశ్యం, సాక్షి సంతకం, చెక్‌మేట్, రిసా, నిర్ణయం, ఇర్తఫా, అమృతంలాంటి కథలు పాఠకుల్ని ఎంతగానో ఆకట్టుకొంటాయి. ముల్కనూరు ప్రజాగ్రంథాలయం నిర్వహించిన కథల పోటీలో రెండవ బహుమతి వచ్చిన కథ 'అమృతం' (పేజీ.5). లాక్డౌన్‌కాలంలో ఆకలిబాధతో 'రోష్నీ' అనే వేశ్య కథాగమనం ఆర్ద్రతతో రాసారు రచయిత. పదహారేళ్ళ వయసుతో శ్రీనుని నమ్మి వాడితోపాటు పట్నానికి రావడం నాలుగురోజులు సరదా తీర్చుకుని తనని వేశ్యావాటికకు అమ్మేసి వెళ్లిపోవడం లాక్డౌన్ తమ వృత్తిని దెబ్బతీసినంత ఘోరుగా ఏ వృత్తినీ, వ్యాపారాన్ని దెబ్బతీసి ఉండదు. వేశ్యావాటికలన్నీ విటులతో కిటకిటలాడే స్థితి లాక్డౌన్ తమ వృత్తిని దెబ్బతీయడంతో రోష్నీ ఆకలితో రోజుల తరబడి పస్తులుండటం ఇంటి ఓనర్ ఆకలి తీర్చి వీధిలో అడుక్కొనే రషీద్‌చాచాకు బిర్యానీ, రెండువందలు అందించి తోటిమానవుని ఆకలి అవసరం తీర్చే 'రోష్నీ' మానవత పాఠకుల్లో ఆమెపై సానుభూతి కలుగుతుంది. పరిస్థితులు బాగున్నప్పుడు ఇష్టపడే పాత్రప్రియుడు రమేష్ 500 రూ. ఇవ్వనిరాకరించే స్వార్థపరుల మనస్తత్వాలకి అద్దం పట్టే కథే 'అమృతం'. అన్ని కథలు ఉత్కంఠభరితంగా ఉన్నాయి. **(నీడ, రచన: సలీం, వెల: రూ 150, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**- తంగిరాల చక్రవర్తి**



# అరకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి

**మన్యంలో గిరిజనులకు ఆదాయ వనరుగా కాఫీ సాగు విస్తరణ ఏడాదికి ఏడాదికి పెరుగుతూ వస్తూ ఉంది. సేంద్రీయ(ఆర్గానిక్) ఎరువులతో కాఫీ పంట గిరిజనులు సాగు చేయడంతో అరకు కాఫీ నాణ్యతతో పండ్లు దిగుబడి కావడమే కాకుండా అరకు కాఫీని ఎవరు రుచి చూసినా మర్చిపోలేనంత రుచి కాఫీ ఘుమఘుమలు దాని సువాసన ఎంతో అద్భుతంగా ఉంటుంది. అరకు కాఫీ రుచి చూసిన ఏ దేశాధినేతైనా అరకు కాఫీ రుచిపై చర్చించాల్సి తీరాల్సిందే. అరకు కాఫీని భారతదేశ ప్రధాని నరంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, మాజీ గవర్నర్ నరసింహాన్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దేశవిదేశాల ప్రతినిధులతో నిర్వహించే సమ్మిట్‌లో కూడా అరకుకాఫీ రుచిచూడాల్సిందే.**

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న (అల్లూరి జిల్లా ఏజెన్సీ) 11 మండలాల్లో గత ప్రభుత్వాలు గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కాఫీ తోటలు కాఫీ సాగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గిరిజన రైతులకు కాఫీ మొక్కలను సరఫరా చేయడం 1989 ఐటిడిఏ ద్వారా ప్రారంభించారు. గిరిజనులు అడవులను పోడు వ్యవసాయం కోసం చెట్లను నరికివేయడంతో పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు గాను గిరిజనులకు ప్రత్యామ్నాయంగా కాఫీ సాగుపై శ్రద్ధ చూపుతారనే ఉద్దేశ్యంతో కాఫీ సాగును విశాఖ ఏజెన్సీలో పరిచయం చేసారు. అప్పటి నుంచి 2002 సంవత్సరం వరకూ 32072 ఎకరాల్లో కాఫీ తోటలు అభివృద్ధి చెందాయి. 2003 నుంచి 2008 వరకూ 64,265 ఎకరాల్లో మన్యంలో కాఫీ తోటలు పెంపకం చేపట్టారు. 2009 సంవత్సరంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కాఫీ ప్రాజెక్టును ప్రారంభించి 2009 నుంచి 2016 వరకూ 61,684 ఎకరాల్లో, 2016లో నుంచి 2024 వరకూ 84 వేల ఎకరాల్లో కాఫీ తోటలను అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం ప్రోత్సాహంతో 2లక్షల 42 వేల 021 ఎకరాల్లో ఏజెన్సీ వ్యాప్తంగా కాఫీ సాగు చేస్తున్నారు. కాఫీ తోటల సాగు ద్వారా 2,36,618 మంది గిరిజన రైతులు లబ్ధిపొంతున్నారు. అంతేకాకుండా గిరిజన రైతులకు కాఫీ సాగు లాభదాయకంగా ఉండటంతో సుమారు 30 వేల ఎకరాల్లో కాఫీ పంట సాగు చేస్తూ ఉన్నారు. మన్యంలో మొత్తం 2,72 లక్షల వరకూ కాఫీ తోటలు ఉన్నాయి. వీటిలో సుమారు ఒక లక్ష 52 వేల ఎకరాల్లో మాత్రమే ఏడాదికి సుమారు 72 వేల కాఫీ దిగుబడి వస్తూ ఉంటుంది. ఎకరాకు ఏడాదికి ఒక గిరిజన రైతుకు సుమారు యాభైవేల రూపాయలు వరకూ ఆదాయం రావడంతో ఆయా గిరిజన కాఫీ రైతు కుటుంబాలు కాఫీ సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. 2014 సంవత్సరంలో మన్యానికి కాఫీ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హుదూద్ తుఫాన్‌లో మన్యంలో కాఫీ తోటలు ధ్వంసం అయి తీవ్రంగా



**దిగుబడి అయిన కాఫీ పండ్లు**

రైతులు నష్టపోయారు. దీంతో మళ్లీ మన్యంలో పూర్వవైభవం తీసుకురావడానికి కాఫీ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం- కేంద్రప్రభుత్వం సంయుక్తంగా చేపట్టింది. ఇందులో భాగంగా 2015 నుంచి 2025 సంవత్సరం వరకూ 1లక్ష కాఫీ తోటలు అభివృద్ధికి అప్పటి టిడిపి ప్రభుత్వం 526 కోట్ల రూపాయలతో ప్రత్యేక కాఫీ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 2015 నుంచి 2024 సంవత్సరం వరకూ 84వేల ఎకరాల్లో తోటలను అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. కాఫీ ప్రాజెక్టు ప్రారంభంతో పాటు అప్పటి ఇప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అరకు కాఫీగా నామకరణ చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా చంద్రబాబు అరకుకాఫీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటూ ఎక్కడ ఏ సమావేశాలు జరిగినా అరకుకాఫీని రుచి చూపించేవారు. అరకులో అప్పటి గవర్నర్ నరసింహన్‌తో సిఎం చంద్రబాబు వచ్చి అరకు కాఫీని అక్కడ ప్రమోట్ చేసారు. మన్యంలో కాఫీ సాగును మాత్రం తెలుగు దేశం పార్టీ హాయాంలో విస్తరించిందనే చెప్పాలి. మన్యంలో పండించే కాఫీలో రెండు రకాలు ఉంటాయి.

ఒకటి పార్చిమెంట్, రెండు చెర్రి. ఇందులో పార్చిమెంట్ తొక్కతీసిన పప్పు, చెర్రీ తొక్కతీసిన గింజలుగా విభజించారు. రైతులు పండించే కాఫీని జిసిసి లేదా ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం పార్చిమెంట్ ధర రూ/- 280 రూపాయలు కాగా చెర్రి 145 రూపాయలకు కొనుగోళ్లు చేస్తున్నారు. అరకు కాఫీ రుచి చూసిన వారు ఎవరైనా అరకు కాఫీకి ఫిదా అవ్వవలసిందే. ఇటీవల మన్‌కీబాత్‌లో ప్రధాని నరేంద్రమోడీ అరకు కాఫీ రుచి కోసం ప్రస్తావించడంతో అరకు కాఫీకి దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంత ఖ్యాతి సంపాదించిపెట్టిందో తెలుస్తోంది. మన్యంలో కాఫీ తోటల పెంపకం సేంద్రీయ ఎరువులతో సాగు చేపట్టడంతో నాణ్యతగల కాఫీ పండ్లను దిగుమతి అవ్వడంతో మన్యం కాఫీ సాగుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో కాఫీ తోటల సాగుకు అంతగా ప్రాధాన్యత ఇచ్చేవారు కాదు అయితే అరకుకాఫీకి ప్రపంచ వ్యాప్తంగా అరకు కాఫీ రుచి సువాసన దానిని ఘుమఘుమలు ప్రసిద్ధి చేందింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి ఇటీవల అరకు పర్యటనకు వెళితే చంద్రబాబు ప్రత్యేకించి తన సతీమణి భువనేశ్వరికి ఫోన్ చేసి అరకు కాఫీ రుచిచూసి తనకు చెప్పాలని మరీ చెప్పారంటూ స్వయంగా సిఎం చంద్రబాబు నాయుడు చెప్పడం దీని ప్రాముఖ్యత ఎలా ఉందోతెలుస్తోంది.





కాఫీ మొక్కకు దిగుబడి వచ్చిన కాఫీ పండ్లు

దేశవిదేశాల నుంచి పర్యటకులు అరకు పర్యటనకు వస్తే ఖచ్చితంగా అరకు కాఫీ రుచిచూడకుండా వెళ్లరు. అంతేకాకుండా లొట్టలేసుకుని కాఫీ త్రాగుతూ ఎంజాయ్ చేస్తుంటారు.

**అరకు కాఫీకి అవార్డుల పంట:-** మన్యంలో సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న కాఫీ తోటలు పెంపకానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. నాణ్యతతో కూడిన కాఫీ పండ్లు దిగుబడి రావడంతో ఇక్కడ దిగుబడి అయ్యే కాఫీ పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా మంచి గిరాకీ ఉంది. దీంతో అరకు కాఫీకి అనేకసార్లు అవార్డులు సైతం సొంతం చేసుకుంది. చింతపల్లి, జికెవీధి మండలాల్లో పండిచే కాఫీకి కాఫీ అర్గానిక్ సర్టిఫికేట్ ఉత్తమ కాఫీ అవార్డును, అలాగే ఒక జిల్లా -ఒక ఉత్పత్తి జిసిసి అరకు వేలీ కాఫీ ఒడిఒపి అవార్డును,అలాగే ట్రేడ్‌మార్కెట్ రిజిస్ట్రేషన్‌లో జిసిసి అరకువేలీ కాఫీ అవార్డును, ఐఈసి ఇంపోర్టర్- ఎక్స్ పోర్టర్ కోడ్ లైసెన్స్ ఫర్ ఎక్స్‌పోర్టు ఆఫ్‌జిసిసి కాఫీటూ ఫర్‌జీన్ కంట్రీస్ అవార్డు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్‌కీబాత్‌లో జిసిసి అరకువేలీ కాపీ కోసం ప్రస్తావనతో ప్రశంసలు అందించ డంతో అరకు కాఫీకి ప్రపంచ వ్యాప్తంగా ఎంత ఖ్యాతీ గుర్తింపు వచ్చిందో తెలుస్తోంది. ఏది ఏమైనా అరకు కాఫీకి ప్రతీ ఏడాది గిట్టుబాటు ధర కల్పిస్తూ గిరిజనుల ఆధాయవనరులు శాశ్వతంగా ఉండేలా చర్యలు తీసుకుంటే మన్యంలో మరింతగా కాఫీ సాగు విస్తరించే అవకాశాలు ఉన్నాయి.

**- పి.సత్యనారాయణ,**
ప్రభాతవార్త, పాడేరు



## మెదడును చదివే మెషీన్

మెదడులో ఏం ఆలోచిస్తున్నామో అక్షర రూపంలో కనిపించేలా చేసే నూతన సాంకేతికతను అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ వివరాలు 'నేచర్ హ్యూమన్ బిహేవియర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇది మూగవారికి చాలా ఉపయోగపడుతుందని పరిశో ధకులు తెలిపారు. మెదడులోని నిర్దేశిత ప్రాంతాల్లో కొన్ని సూక్ష్మ పరికరాలు అమరుస్తారు. తర్వాత ఏం ఆలోచిస్తున్నారో బయట ఉండే మరో పరికరంలో అక్షరరూపంలో కనిపిస్తుంది. దీనిని ముందుగా ఇద్దరిపై ప్రయోగించారు. చెంచా, పాము, యుద్ధక్షేత్రం వంటి పదాల గురించి ఆలోచించమని కోరగా వారి ఆలోచనలు అక్షరరూపంలో నమోదైంది.

మెదడులో అమర్చిన పరికరాలతో ఇటర్నల్ స్పీచ్‌కు అనుసంధానమై ఉండే నాడీ కార్యకలాపాలను గుర్తించడం ద్వారా ఈ సాంకేతికత పని చేస్తుందని పరిశోధకులు తెలిపారు.

భవిష్యత్తులో ఈ ప్రయోగం విజయవంతం అయితే మూగవారికి చక్కగా ఉపయోగపడడం మాత్రమే కాక, వారు తమ కెరీర్‌ను మరింతగా నైపుణ్యంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేస్తుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు.

కథ

# సాహసి భైరవ

రాజారాం తోట అనే గ్రామంలో యాదవుడు అనే గొర్రెల కాపరి ఉండేవాడు. అతనికి గొర్రెలతో పాటు ఒక చిన్న కుక్క కూడా ఉండేది. ఆ కుక్క పేరు భౌభైరవ. ఆ కుక్క చాలా తెలివైనది. యాదవుడు ప్రతిరోజూ గొర్రెలను మైదానంలోకి తీసుకెళ్లినప్పుడు, భౌభైరవ కూడా అతనితోపాటు వెళ్లేది. యాదవుడు తన గొర్రెలను చాలా జాగ్రత్తగా చూసుకునేవాడు.




ప్రతి ఉదయం, తన గొర్రెలను తీసుకొని గ్రామానికి దూరంగా ఉన్న గడ్డి మైదానాలకు వెళ్లేవాడు. అతను గొర్రెలను గడ్డితింటూ, నీరు తాగుతూ, అవి సురక్షితంగా ఉండేట్టు చూసేవాడు. భౌభైరవ కూడా గొర్రెలను కాపాడడంలో తన పాత్రను బాగా నిర్వర్తించేది. గొర్రెలు ఎక్కడికి వెళ్లినా, భౌభైరవ కూడా గొర్రెలను కాపాడడంలో తన పాత్రను బాగా నిర్వర్తించేది. ఒకరోజు, యాదవుడు గొర్రెలను గడ్డి మైదానంలో వదిలేసి, నీళ్లు తాగడానికి చెరువుకు వెళ్లాడు. ఆ సమయంలో, ఒక పెద్దపులి మైదానంలోకి వచ్చింది. పులి గొర్రెలను చూసి, వాటిపై దాడి చేయడానికి సిద్ధమైంది. భౌభైరవ పులిని గమనించి, గొర్రెలను కాపాడడానికి సిద్ధమైంది. అది గొర్రెలను సమీపంలోని అడవిలోకి తోలించి, పులిని ఎదుర్కొనడానికి సిద్ధమైంది. పులి భౌ భైరవను చూస్తూ, అటుపక్క దూరంగా ఒంటరిగా భారీకాయాలతో వున్న రెండు ఆవులు వున్నాయని గట్టిగా నమ్మకంగా అబద్ధం చెబుతూ పులిని ఏమార్చింది. అలా గొర్రెలతో బాటు తానూ తప్పించుకోవడానికి సమయస్ఫూర్తితో ప్రయత్నించింది. భౌభైరవ పులిని దారి తప్పించడం కోసం గట్టి ప్రయత్నమే చేసి, పులిని అక్కడ నుండి దూరంపోయేలా చేసింది. గొర్రెలను సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లింది. అంతలో, యాదవుడు నీళ్లు తాగి, తిరిగి వస్తూ గొర్రెలు సురక్షితంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. అతను భౌభైరవను చూసి, దాని ధైర్యాన్ని, తెలివిని మనసులోనే ప్రశంసించాడు. యాదవుడికి భౌ భైరవపై ప్రేమ మరింత పెరిగింది. పులి, గొర్రెలను తినకుండా భౌ భైరవ చేసిన సాహసాన్ని చూసి, ఆశ్చర్యపోయాడు.

ఈ సంఘటన అనంతరం, గ్రామంలో భౌభైరవకు మంచి పేరు వచ్చింది. అది ఒక సాధారణ కుక్కగా కాకుండా, ఒక సాహసిగా, అందరి మనసుల్లో నిలిచింది. ఒక రోజు, గ్రామంలో పెద్ద పండుగ జరిగింది. గ్రామస్థులు ఈ పండుగను జరుపుకునేందుకు సంతోషంగా ఉన్నారు. భౌభైరవను సన్మానించారు గ్రామస్తులు. పండుగ ముగిసిన తర్వాత, భౌ భైరవ తన స్నేహితులైన గొర్రెలను, యాదవుడిని కలిసి సంతోషంగా ఆడింది. అది తన పాత్రను నిర్వర్తిస్తూ, గొర్రెలను కాపాడటంలో ప్రతిభను చూపుతూ, సాహసాన్ని ప్రదర్శించి గ్రామంలో అద్భుతమైన విశ్వాసపాత్రురాలిగా నిలిచింది. భౌ భైరవ పిల్లలకు ఒక స్ఫూర్తిగా మారింది. వృద్ధాప్యం రావడంతో ఆరునెలల్లోనే జబ్బు చేసి మరణించింది. తన జ్ఞాపకాల్ని గ్రామస్తులకు అందించిపోయింది.

– చిట్యాల రవీందర్

## బాలగేయం

### ప్రకృతి-వికృతి



ఎండా ఎండా తగ్గమ్మా
దండం నీకే పెట్టేము
దండంగిండం నాకొద్దు
అడవులనే తెగ నరకొద్దు
మొక్కలనెన్నో నాటండి
చక్కగ వాటినే పెంచండి
పచ్చగా మేము వుంటేనే
వెచ్చదనమే తగ్గేనండి
ప్లాస్టిక్ భూతాన్ని
తరిమేద్దాం
పర్యావరణాన్ని రక్షిద్దాం
వికృత చేష్టలు మానేద్దాం
ప్రకృతినే కాపాడేద్దాం

– గుండాల నరేంద్రబాబు



## హలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎ.అద్వైత,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. గుడ్లగూబ చీకట్లో ఎలా చూడగలుగుతుంది?



**జవాబు: అద్వైత!** గుడ్లగూబను 'చీకటిపక్షి' అని పిలుస్తారు. దీని కళ్లు ప్రత్యేక నిర్మాణాన్ని కలిగి వుండటంతో పగటివేళ కంటే రాత్రివేళల్లోనే స్పష్టంగా చూడ గలుగుతుంది. దీని కంటిలోని కటకం, రెటీనాల నడుమ దూరం మన కండ్ల రెటీనా, కటకంల మధ్యనున్న దూరం కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివలన వస్తువు ప్రతిబింబం రెటీనా మీద పెద్ద ఆకారంగా పడుతుంది. 'పెక్టన్' అనే ప్రత్యేక అంగం దీని కంటిలో ఉండటంతో ప్రతిబింబాన్ని ఎంతో స్పష్టంగా గ్రహించే వీలు వుంది. దీని కంటిలో రక్త నాళాల సంఖ్య ప్రతి చదరపు మిల్లీ మీటరుకు దాదాపు పది వేలు ఉంటాయి. మన కంటిలో అయితే చదరపు మిల్లీమీటరుకు రెండు వేల వరకే ఉంటాయి. ఈ దృష్ట్యా, గుడ్లగూబ మన కంటే అయిదు రెట్లు అధిక స్థాయిలో చూడగలుగుతుంది.

దీని కంటిలో ప్రొటీన్‌లతో రూపొందించబడి వుండే ఒక ఎరుపు రంగు పదార్థం ఉంటుంది. దీనివలననే రాత్రివేళలో దీని కంటి వెలుగు మరింతగా పెరుగుతుంది. మరో కారణమేమిటంటే– దీని కంటి పాప ఎక్కువ పరిధిలో వ్యాపించగలదు. వీటన్నిటి మూలంగా గుడ్లగూబకు కంటిచూపు ఎంతో ప్రకాశవంతంగా వుండి రాత్రివేళల్లో సైతం ఆహారాన్ని సంపాదించుకోవడానికి వీలుంటుంది. గుడ్లగూబ కళ్లను దూరం నుంచి పరిశీలించి చూసినా తెలుస్తుంది.. అవి చాలా పెద్దగా వుండి, కనుగుడ్లు పెద్దవిగా ఉంటాయి.

# తలపాగా వైభవం



ఐ.ప్రసాదరావు

**అనాదిగా** భారతీయ జీవనశైలిలో, సంస్కృతి సాంప్రదాయాలతో మమేకమైన ఒక వస్త్రాభరణం తలపాగా. రాజసాన్ని ప్రదర్శించే చిహ్నంగా ఆనాటి రాజులు, రాణిల తలపై మెరిసే తలపాగా, ఆనాటి వైభవాన్ని చాటి చెప్పేది. సామాన్యుడి తలపై ఉండే తలపాగా ఎండవేడిమి నుండి, వర్షం నుండి, చలిగాలుల నుంచి రక్షించే కవచంగా ఆనాటి నుంచి నేటి వరకూ భారతీయుల జీవనవిధానంలో ఇమిడి ఉన్నది అంటే అతిశయోక్తి కాదు. దాదాపు దేశంలో అన్ని పేద, సామాన్య కుటుంబాల్లో సాధారణంగా మగవారు తలపై ధరించే వస్త్రం తలపాగా..ఆ విధంగా తలపాగాతో ప్రతీ భారతీయునితో విడదీయరాని అనుబంధం ఉంది.



సింధూ నాగరికత కాలంలోనే ఆనాటి ప్రజలు తలపాగా ధరించినట్లు త్రవ్వకాలలో లభించిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. అదేవిధంగా వివిధ చెక్కబడిన రాతిశిల్పాలు పరిశీలిస్తే తలపాగా ఔన్నత్యం కనపడుతుంది. వేదకాలంలో పాలించే రాజులు రాణులు తలపాగా ధరించినట్లు తెలుస్తోంది. సామాన్య ప్రజలు కూడా తలకు రక్షణగా తలపాగా ధరించడం దేశంలో చాలాచోట్ల ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా రాజస్థాన్‌లో ఎండ తీవ్రత తగలకుండా ఉండేందుకు తలపాగా (పగ్రీ) ధరిస్తారు. రాజస్థాన్‌లో తలపాగాలు ప్రత్యేకమైన ఆభరణాలతో తయారు చేస్తారు. పంజాబ్‌లో దాదాపు అందరూ తలపాగా ధరిస్తారు. ఇదొక మత ఆచారంగా కూడా పాటిస్తారు. దస్తార్ పేరుతో పంజాబీలు తలపాగా ధరిస్తారు. భారతదేశంలో కేశ సౌందర్యానికి పురుషులు, మహిళలు కూడా ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటారు. మహిళలు ఒత్తుగా, పొడవైన జుట్టు ఉండాలి అని కోరుకుంటారు. కేశసంరక్షణకు అనాదిగా అనేక నూనెలు, ఔషధాలు వాడుతూ ఉంటారు. కేశ అలంకరణలో భాగంగా తలపాగా కూడా ప్రముఖపాత్ర పోషించింది. వివిధ నృత్యాల్లో అలంకరణ కోసం తలపై తలపాగా, ఆభరణాలు అలంకరిస్తారు. ఇక భారతదేశంలో చాలా రాష్ట్రాల్లో పెళ్లి సమయంలో తలపాగా ధరిస్తారు. ఈ సాంప్రదాయం అనాదిగా వస్తోంది. తలపాగా అనేది గౌరవానికి, హుందాతనానికి, సమాజంలో స్టేటస్‌కు చిహ్నంగా కొనసాగుతూ ఉన్నది. ప్రాంతాల వారీగా, కులాల వారీగా, వృత్తులపరంగా రకరకాల తలపాగాలు ధరించడం జరుగుతుంది. పేటాపేరుతో కర్ణాటక, పెహటా (పటకా) పేరుతో మహారాష్ట్రం, పోచంపల్లి నేతతో తెలంగాణలో తలపాగాలు ధరించుట జరుగుతుంది. వివిధ సందర్భాలు వివాహం, పండుగలు, వేడుకలను బట్టి తలపాగాలు ధరించుట జరుగుతుంది. భారతీయ సంస్కృతిలో, మతక్రతువుల్లో, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, వివిధ సందర్భాలలో తలపాగా ధరించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అంతేకాకుండా సామాన్య ప్రజలకు తలకు రక్షణగా, వడదెబ్బ తగలకుండా రక్షణ కవచంగా ఉపయోగపడుతుంది.

ఈవిధంగా వేదకాలం నుంచి నేటివరకూ భారతీయుల అలంకరణలో తలపాగా ప్రముఖపాత్ర వహిస్తుంది. అందానికి, ఆచారాలకు, రక్షణకు, రాజదర్పానికి ప్రతీకగా తలపాగా చిహ్నంగా కొనసాగుతూ ఉన్నది.

మారుతున్న కాలంతో తలపాగా కూడా నూతన ఒరవడులు అందిపుచ్చుకుంది. రకరకాల తలపాగాలు, రకరకాల రంగులు, స్టైల్స్‌తో చూపరులను ఆకట్టుకుంటుంది. వివిధ ఆభరణాలు తలపాగాలపై అలంకరిస్తూ ఆకర్షణీయంగా తయారవుతు న్నాయి. రాణీలు కూడా గతకాలంలో తమదైన శైలిలో తలపాగాలు ధరించినట్లు ఝాన్సిలక్ష్మీబాయి వంటి వీర వనితల చిత్రపటాలను బట్టి తెలుస్తోంది. మొఘలుల కాలంలో కూడా తలపాగా నూతన ఒరవడులు సంతరించుకుంది. ఇక మన స్వాతంత్ర్యసమరయోధులు బాలగంగాధర్ తిలక్, మంగల్‌పాండే, లాలా లజపతిరాయ్, తాంతియా తోపే, గోపాలకృష్ణ గోఖలే, దాదాబాయ నౌరోజి వంటివారు, సంఘ సంస్కర్తలు రాజారామ్మోహన్ రాయ్, వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తిపంతులు వంటివారు కూడా తలపాగా ధరించిన ధీరులే..ఇక రాజకీయ నాయకులు కూడా తరచూ వివిధ రకాల తలపాగా ధరించడం చూస్తూనే ఉంటాం. ఓటర్లను ఆకర్షించేందుకు, వేడుకల్లో ఆయాప్రాంతాల సందర్శన సందర్భంగా వివిధ తలపాగాలు ధరిస్తారు. ఈవిధంగా భారతీయుల జీవనసరళిలో రాజులు, చక్రవర్తుల నుంచి సామాన్య మానవుని వరకూ సందర్భానుసారంగా తలపాగా విశిష్టమైన పాత్ర పోషించింది అని మన చరిత్ర ఉద్ఘోదిస్తుంది.



ఇతరులను క్షమించడం ఓ గొప్ప గుణమేకాదు మనకు మనశ్శాంతిని తిరిగి బహుమతిగా ఇస్తుంది. ప్రేమ తుదిరూపమే క్షమాగుణం. నన్ను నేను సంస్కరించుకునే ఉత్తమమార్గం ఇతరుల్ని క్షమించి వేయడం. మనపట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిని క్షమించడం, ఎవరికైనా మనవల్ల ఇబ్బంది కలిగితే వెంటనే క్షమాపణలు అడగడం ఓ మహత్తర సద్గుణం. క్షమాపణ అనేది ఆధ్యాత్మిక, మానసిక, భావోద్వేగ, శారీరక ఆరోగ్య సాధనకు శక్తివంతమైన సాధనం.

# క్షమాపణ ఓ సద్గుణం

డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి





క్షమాగుణం ప్రాధాన్యాన్ని గుర్తించి మానవసమాజం తమ జీవనశైలిని సానుకూలంగా మార్చుకోవడం, క్షమాగుణశక్తిని అవగాహనపరచడం నిరంతరం కొనసాగాలి.



**క్షమాగుణం ఓ దివ్యౌషధం**


క్షమాగుణం మనకు ఓ దివ్యౌషధంగా పని చేసి మానసిక ఒత్తిడి, భావోద్వేగ నొప్పి, దుఃఖం, గాయాల నుండి ఉపశమనం కలుగజేస్తుంది. క్షమాగుణం ద్వారా కరుణ, దయ, ప్రేమలను బోధిస్తుంది. క్షమించి సంబంధాలను యధావిధిగా కొనసాగించవలసిన అవసరం కూడా ఏమీ ఉండదని గమనించాలి. ఒకరు చేసిన పొరపాటును క్షమించడం అంటే దానిని సమర్థించినట్లు కాదని తెలుసుకోవాలి. క్షమించడం వల్ల ఒకరు గెలిచి మరొకరు ఓడినట్లు కూడా కాదు. క్షమించడం వల్ల కొన్ని సంబంధాలు పునర్‌స్థాపితం కావడంతో పాటు మరింత బలపడవచ్చు కూడా. క్షమించడం లేదా క్షమాపణలు అడగడం ద్వారా మన మనస్సు తేలిక కావడంతో పాటు మనోగాయాల తగ్గింపుకు లేపనంగా కూడా పని చేస్తుంది. క్షమించడం ద్వారా మనల్ని గతం నుంచి వేధిస్తున్న బాధలు తేలిక కావడంతో పాటు మన క్రియాశీలతను పెంచుతుంది.




**క్షమాగుణం బహుళ ప్రయోజనాలు**

క్షమాగుణం ఓ అద్భుత సానుకూల నిర్ణయం, క్షమాగుణం కారణంగా పలు అదృశ్య ప్రయోజనాలు కలుగుతాయి. గతంలో మనం చేసిన పొరపాట్లను మనమే క్షమించడం అలవర్చుకోవాలి (సెల్ఫ్, ఫర్, గివ్, నెస్). క్షమించవలసిన వ్యక్తిని లోతుగా అర్థం చేసుకోవడానికి ఆస్కారం దొరుకుతుంది. క్షమాగుణంతో కోపం, పగ, చేదు అనుభవాల నుంచి ఉపశమనం కలిగి మానసిక, శారీరక ఒత్తిడి తగ్గుతుంది. క్షమించకపోవడంతో ఆ అవసర బరువును మన మనసు మోయవలసి వస్తుంది. క్షమించడం వల్ల అనేక దృశ్య, అదృశ్యగాయాలు మానిపోతాయి. క్షమించడంతో గత గాయాలకు చరమగీతం పాడినట్లు అవుతుంది.

క్షమించడాన్ని అలవాటు చేసుకున్నపుడు మనలోని ఆందోళనలు తగ్గి రక్తపోటు అదుపులోకి వస్తుంది. క్షమాగుణంతో గుండె బలపడడం, రోగనిరోధకశక్తి పెరగడం, శారీరక నొప్పులు మాయం కావడం కూడా జరుగుతుంది. మనపట్ల ఇతరుల అనుచిత ప్రవర్తనను క్షమించకుండా మనసులో దాచుకున్నపుడు అది మనశ్శాంతిని తొలిచే చెదలుగా కూడా మారుతుంది. క్షమించడం, క్షమాపణలు కోరడం బలహీనత కాదని, ఆ సద్గుణం మనకున్న బలమైన శక్తి అని తెలుసుకుందాం. నేటి నుంచైనా క్షమాగుణాన్ని ఆచరించడానికి ప్రయత్నాలు చేద్దాం. క్షమించడానికి అర్హత కలిగిన వ్యక్తులను నేటి నుంచే క్షమించి ఆరోగ్యంగా, ఉల్లాసంగా అడుగులు వేద్దాం. క్షమాగుణం శక్తిని పలువురికి అవగాహన పరుద్దాం.



ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

కథ

# తొలగిన పొరలు

"గుడ్ మార్నింగ్ డాక్టర్" అంటూ డెర్మటాలజిస్ట్ శరత్ రూంలోకి అడుగు పెట్టింది ప్రముఖ నటి కావ్య.

"గుడ్ మార్నింగ్ కావ్యా.. ఎలా ఉన్నారు? మీకు ఈ మధ్య మళ్లీ ఏదో అవార్డ్ వచ్చిందట కదా! పేపర్లో చూసాను. ఫోన్ చేద్దామనుకుంటే ఏమిటో అశ్రద్ధ" అన్నాడు శరత్ నవ్వుతూ.

"అదా... అవి ఏవో ఒకటి వస్తూనే ఉంటాయి డాక్టర్. మీకు తెలియనిది ఏముంది? కొన్ని తెచ్చుకున్నవి, కొన్ని పుచ్చుకున్నవి" అంది గలగలా నవ్వుతూ.

"అంతేనంటారా?" అన్నాడు శరత్.

"ఏమీ అనుమానం లేదు. ఇప్పుడు అన్ని రంగాలలో అంతేగా" అంది కావ్య అదోలా నవ్వుతూ.


"ఇంతకీ ఇంత పొద్దున్నే వచ్చారేమిటి?" అని అడిగాడు శరత్.

"ఏముంది డాక్టర్? మామూలే. నా ముఖం రోజు రోజుకీ చంద్రబింబంలా తయారవుతోంది. కవులు వర్ణించే చంద్రబింబం కాదు డాక్టర్, శాస్త్రజ్ఞులు పరిశోధించే చంద్రబింబం" అంది కావ్య బాధగా నవ్వుతూ.

శరత్‌కి కావ్య భావం అర్థం అయ్యింది. అతను కావ్య ముఖం పరీక్షించాడు. అంతా గుంటలు గుంటలుగా తయారు అయ్యింది. అక్కడక్కడా దద్దుర్లు ఉన్నాయి. అక్కడ నొక్కితే ఎర్రగా అవుతోంది.

"అలర్జీ బాగా ఉందమ్మా. మీరు కాస్త మేకప్ తగ్గించాలి" అన్నాడు శరత్.

"ఇంకా సరిపోలేదంటున్నారు డాక్టర్. నేను ఇంకా చిన్న వయస్సుదానిలా, అందంగా కనిపించాలట. ఈ మధ్య కళ్లల్లో వేసే గ్లిసరిన్ చుక్కల వల్ల కళ్ల మండుతున్నాయి కూడా" అంది కావ్య బాధగా.



"నేను అర్థం చేసుకోగలను. మేకప్‌లో ఉండే వివిధ రకాల కెమికల్స్ మీ చర్మానికి హాని చేస్తున్నాయి. అలాగే మీకు దగ్గరలో ఉంచే రకరకాల లైట్లు చర్మానికి ఇబ్బంది కలిగిస్తాయి. అన్నీ కలిపి అలర్జీ కలిగించి బాధ పెడుతున్నాయి. వాటికి ఆయింట్మెంట్స్ ఉన్నాయి, రాస్తాను. స్టెరాయిడ్స్ వాడితే వెంటనే ఫలితం కనిపిస్తుంది. కానీ అవసరంగా స్టెరాయిడ్స్ వాడడం మంచిది కాదు. వాటివల్ల ఇమ్యూనిటీ తగ్గుతుంది. మందులు రాసిస్తాను. మేకప్ తప్పదు కనుక వేసుకోండి కానీ వీలైనంత తొందరగా కడిగేసుకోండి. మీ కంటి బాధ తగ్గడానికి డ్రాప్స్ రాసిస్తాను. అప్పటికీ రిలీఫ్ లేదంటే ఆప్తొల్‌మోలోజిస్ట్‌ని కన్సల్ట్ చేయండి" అన్నాడు శరత్ మందులు రాస్తూ.

"అసలు తను కలవని 'జిస్ట్' ఎవరున్నారు? అనుకుని విర్తకిగా మనస్సులోనే నవ్వుకుంది కావ్య.

అంతలో కావ్య ఫోన్ మోగింది. ఇంటి నుంచి కావ్యకూతురు దివ్య ఫోన్ చేసింది. కావ్య గబగబా డాక్టర్ రూమ్ బయటకు వచ్చింది.

"ఏమ్మా! దివ్యా? ఏమిటి?" అని ఆదుర్దాగా కూతురిని అడిగింది.

"అమ్మా, నాకు ఆయా చేసిన టిఫిన్ నచ్చలేదు. నువ్వు ఎంతసేపట్లో వస్తావు? వచ్చాక నాకు టిఫిన్ చేస్తావా?" అని అడిగింది దివ్య.

కావ్యకి ఏం సమాధానాం చెప్పాలో అర్థమవలేదు. ఎందుకంటే అరగంటలో గైనికాలజిస్ట్‌తో అపాయింట్మెంట్ ఉంది. ఇంటికి వెళ్లి, కూతురుకి టిఫిన్ చేసి ఇచ్చి, గైనికాలజిస్ట్ దగ్గరికి వెళ్లే టైం లేదు. ఆ తరువాత షూటింగ్‌కి స్టూడియోకి వెళ్లిపోవాలి.

"తల్లీ, ఈరోజు హోటల్లో టిఫిన్ తినేసి వెళ్లు. డాడీ, నువ్వు టిఫిన్ తిన్నాక డాడీని కారులో నిన్ను స్కూల్ దగ్గర దింపెయ్యమను" అంది కావ్య.

"డాడీ వెళ్లిపోయారమ్మా" అంది దివ్య. ఒక నిమిషం ఆలోచించింది కావ్య. గైనికాలజిస్ట్ దగ్గరకు ఇంకొక రోజు వెళ్లవచ్చు. కడుపునెప్పి కదా. రెండు రోజులు ఎలాగో భరించాలి, భరిస్తాను. ఆవిడకు ఈరోజు రానని చెప్పేస్తాను" అనుకుంది కావ్య.

"సరే తల్లీ.. నేను వస్తున్నాను" అని కూతురికి చెప్పి, వడి వడిగా నడుచుకుంటూ డాక్టర్ రూమ్‌లోకి వెళ్లింది కావ్య. ఆయనకు ఫీజ్ ఇచ్చేసి, ప్రిస్క్రిప్షన్ తీసుకుని కంగారుగా బయటకు నడుచుకుంటూ వెళ్లింది.

ఇంటికి వెళ్లి దివ్యకి రెండు ఆమ్లెట్లు వేసి– అనుకోని అవకాశం, తీరిక దొరికింది కనుక తనూ రెండు తింది కావ్య.

**"ఇంకో స్పెషలిస్ట్ దగ్గరకు వెళ్లమంటున్నారా డాక్టర్!" ఇలా స్పెషలిస్టుల చుట్టూ తిరగనా? షూటింగ్‌లు అటెండ్ అవనా?" అంది కావ్య.**

**"తప్పదండీ. మీరు అన్నట్టుగానే ఇటు హెల్త్ చూసుకోవాలి, అటు మీ కెరీర్‌ని పట్టించుకోవాలి"**

కావ్య చాలా రోజులు షూటింగ్ హడావిడిలో పొద్దున్న ఏమీ తినకుండానే స్టూడియోకి వెళ్లిపోతుంది.

ఎంత కంగారుపడ్డా రోడ్డు వెహికల్స్‌తో నిండిపోవడం వలన ఆరోజు కొంచెం లేట్ అయ్యింది.

కావ్య వెళ్లేసరికి హీరోతో సహా అందరూ కావ్యకోసం ఎదురు చూస్తున్నారు.

నిర్మాత "కావ్యా, నీ కోసమే అందరం వెయిట్ చేస్తున్నాం. త్వరగా మేకప్ అయి రా" అన్నాడు.

నిజానికి కావ్య మంచి ఇమేజ్ ఉన్న సీనియర్ హీరోయిన్. అటువంటి వ్యక్తితో హీరో ఏమిటి, డైరెక్టర్ ఏమిటి, నిర్మాత ఏమిటి? అందరూ గౌరవంగా నడచుకోవాలి... సౌమ్యంగా మాట్లాడాలి. కానీ డబ్బే ప్రధానం అయిన ఈ రోజులలో ఎవరిని ఎవరూ లెక్క చేయరు. ప్రపంచాన్ని నడిపించేది కేవలం డబ్బు ఒక్కటే.

మేకప్ అవుతుండగా కావ్యకి కడుపునెప్పి ఎక్కువగా వచ్చింది. అంతకు ముందు గైనికాలజిస్ట్ రాసిన మాత్రలు బ్యాగ్‌లో ఉంటే ఒకటి తీసుకుని వేసుకుంది. ప్రస్తుతానికి అంతకన్నా ఏమీ చేయలేదు.

సెట్లోకి వచ్చిన కావ్యని చూసి డైరెక్టర్ "ఏమిటమ్మా, అంత తక్కువ మేకప్ వేసుకొచ్చావు?" అని అడిగాడు.

"అంటే సార్... కొంచెం స్కిన్ ఇరిటేషన్ ఎక్కువగా ఉంది. డాక్టర్‌గారు కాస్త మేకప్ తగ్గించమన్నారు" అంది కావ్య.

"భలేదానివే. ఈరోజు ఇంపార్టెంట్ డ్యూయెట్. నీ ఫేస్ డల్‌గా కనిపిస్తే సినిమా కలెక్షన్లు అమాంతం పడిపోతాయి. ఈ రోజుకు భరించక తప్పదు. కొరియోగ్రాఫర్‌తో ప్రతీ రిహార్సల్ తరువాత, షూట్ చేసిన ప్రతీ సీన్ తరువాత బాగా మేకప్ టచ్ చేసుకోవాలి. ఈరోజు మేకప్ కోసం, మెటీరియల్ ప్రత్యేకంగా హాలీవుడ్ నుంచి తెప్పించాం. మేకప్‌మాన్ కూడా అక్కడ నుంచే వచ్చాడు.

పల్లవి అయిపోగానే షూటింగ్ స్విట్జర్లాండ్‌లో, స్వీడన్‌లో.. మొత్తం అంతా యూరప్‌లోనే. అసలంతా ఫారిన్‌లో పెట్టుకోవచ్చు. వెరైటీగా ఉంటుందని ఇండియాలో మొదలుపెట్టి ఫారిన్లో ముగిస్తున్నా" అన్నాడు డైరెక్టర్.

ఆ మాటలు వినేసరికి కావ్యకి నీరసం ఆవహించింది. కానీ అదేమీ పైకి కనిపించకుండా ముఖానికి నవ్వు పులుముకొని "ఒకే సారో" అంది కావ్య.

ఆ రోజంతా ముఖమంతా మండిపోతోంటే.. కడుపు నులిమేస్తుంటే మౌనంగా భరిస్తూ ముఖానికి నవ్వు పులుముకుని నవ్వుతూ, ఎగురుతూ, తుళ్లుతూ పాట షూటింగ్‌లో పాల్గొంది కావ్య.

ఆ సాయంత్రం వేరే సినిమా షూటింగ్‌లో ఒక విషాద ఘట్టంలో గ్లిసరిన్ లేకుండానే కావ్య కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. తన జీవితంలో ఏదో ఘట్టం గుర్తుకు వచ్చి ఉంటుంది.

..............

మరునాడు సాయంత్రం గైనికాలజిస్ట్ దగ్గరకు వెళ్లి, తన కడుపులో విపరీతమైన నెప్పిగా ఉందనీ, అంతకు ముందు రోజు అలాగే నటించాల్సి వచ్చిందనీ తన బాధను వెళ్లబోసుకుంది కావ్య. గైనికాలజిస్ట్ కావ్యకి చీవాట్లు పెట్టింది.

"ఏమ్మా, మీకు ఆరోగ్యం, జీవితం ముఖ్యమా? లేకపోతే కెరీర్ ముఖ్యమా?" అని కావ్యని కోపంగా ప్రశ్నించింది.

"డాక్టర్! నాకు రెండూ ముఖ్యమే. ఆరోగ్యం లేకపోతే కెరీర్ లేదు. కెరీర్ లేకపోతే జీవితమే లేదు" అంది కావ్య నిర్లిప్తంగా.

"అంటే...?" అర్థోక్తిలో ఆగిపోయింది గైనికాలజిస్ట్.

"ఏముంది డాక్టర్.... నేను నటించకపోతే డబ్బులు రావు. డబ్బులు రాని నా సహచర్యం, జీవితం నా భర్తకు అక్కరలేదు. నా కూతురికి నాన్నని దూరం చేసే హక్కు నాకు లేదనిపిస్తోంది. ఆరోగ్యమో, అనారోగ్యమో నేను బతికున్నంతవరకు నటిస్తూనే ఉండాలి సినిమాల్లో. బహుశా అప్పుడప్పుడు జీవితంలో.." అంటుండగా కావ్య కంఠం బొంగురు పోయింది. కళ్లమ్మట నీళ్లు బొట బొటా కారసాగాయి.

"కావ్యా, ధైర్యంగా ఉండాలి. మీ బీపీ కొంచెం ఎక్కువగా ఉంది. కొన్ని టెస్టులు రాస్తున్నాను. అవి అయ్యాక చూద్దాం. అంతవరకు కడుపునెప్పికి మందులు రాస్తాను. ఒకసారి సైకియాట్రిస్ట్‌ని కలవండి. యు ఆర్ షోయింగ్ సైన్స్ ఆఫ్ డిప్రెషన్. నేను రిఫర్ చేస్తున్నాను" అంటూ మందులు రాసిచ్చి ఆ కాగితంలో పాటు ఒక లెటర్ కూడా రాసిచ్చింది గైనికాలజిస్ట్.

ఆ లెటర్ చూసి విరక్తిగా నవ్వింది కావ్య. "ఇంకో స్పెషలిస్ట్ దగ్గరకు వెళ్లమంటున్నారా డాక్టర్!" ఇలా స్పెషలిస్టుల చుట్టూ తిరగనా? షూటింగ్‌లు అటెండ్ అవనా?" అంది కావ్య.

"తప్పదండీ. మీరు అన్నట్టుగానే ఇటు హెల్త్ చూసుకోవాలి, అటు మీ కెరీర్‌ని పట్టించుకోవాలి"

"సరే డాక్టర్. ఈ టెస్టులు, రిజల్ట్స్ అయ్యాక వస్తాను. అంతవరకు మీరు చెప్పినట్లు మందులు వాడతాను" అంది కావ్య చేతులు జోడిస్తూ.

"ఈ లోపలే సైకియాట్రిస్ట్ దగ్గరకి వెళ్లాలి. లేట్ చేయకండి" అంటూ స్నేహపూర్వకంగా హెచ్చరించింది గైనికాలజిస్ట్.

"అలాగే డాక్టర్" అంటూ బయటకు నడిచింది కావ్య. మనస్సు నిండా ఆలోచనలు ఈగల్లా ముసురుతుంటే సాలోచనగా కారు వైపు నడవసాగింది కావ్య.

..............

కావ్య ఇంటికెళ్లేసరికి కూతురు దివ్య ఒళ్లు తెలియని జ్వరంతో పడుకుంది. ఆయా అప్పటికే తన టైం ప్రకారం వెళ్లిపోయింది.

కావ్య వెంటనే దివ్యకి జ్వరం మాత్రం వేసింది.

"ఒక పెద్ద హీరోయిన్‌గా అటువంటి క్లాస్ హీరోతో సినిమాలు చేయను" అని తిరస్కరించిన నటుడు శేఖర్. అతను వడివడిగా నడుచుకుంటూ కావ్య ఇంటి లోపలికి వచ్చాడు.

తరువాత దివ్య పరిస్థితి చూసిన కావ్య భయపడి వెంటనే భర్తకి ఫోన్ చేసింది.

అతను ఏదో మీటింగ్‌లో బిజీగా ఉన్నాననీ, ఇంటికి రావడం కుదరదనీ, దివ్యని ఎవరైనా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి చూపించమని" చెప్పాడు.

కావ్య వెంటనే దివ్య ఇంట్లో ఉన్న థర్మామీటర్‌తో టెంపరేచర్ చూసింది. బాగా ఎక్కువగా ఉంది జ్వరం. వెంటనే కంగారుగా దివ్యను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లడానికి తయారైంది.

కావ్య కారు తీస్తుండగా విపరీతంగా కడుపులో పోట్లు ప్రారంభం అయ్యాయి. తట్టుకోలేకపోయింది. అలాగే దివ్యని ఎత్తుకుని కారు వరకు తీసుకెళ్లాలనుకుంది. తన ప్రస్తుత పరిస్థితిలో దివ్యని ఎత్తుకుని కారు వరకు తీసుకువెళ్లడం అసాధ్యం అని గ్రహించినా అలాగే కొంత దూరం ఈడ్చుకువెళ్లింది. ఇక కావ్య వల్ల కాలేదు. తన స్నేహితురాలైన ఒక నటికి ఫోన్ చేసింది.

దానికి సమాధానంగా "షూటింగులో ఉన్నాననీ, రాలేనని" చెప్పింది ఆమె.

ఒక నిర్మాతకి ఫోన్ చేసింది. అతను అసలు తనే ఫోన్ చేద్దామనుకుంటున్నాననీ, కావ్య నటిస్తున్న సినిమా చివరి దశలో ఉందనీ, అనుకోకుండా హీరో తన దగ్గరే ఉన్నాడనీ, కావ్య వెంటనే బయలుదేరి వస్తే షూటింగ్ కంప్లీట్ చేస్తానని" అన్నాడు.

కావ్య సమాధానం కూడా చెప్పకుండా ఫోన్ పెట్టేసింది. ఒక పక్క కూతురు అనారోగ్యంతో బాధ పడుతున్నా, కారు ఉన్నా ఎక్కడికీ తీసుకువెళ్లలేని నిస్సహాయ పరిస్థితిలో పడిపోయినందుకు కావ్యకి దిగులు ఆవహించింది.

అంతలో సైకియాట్రిస్ట్ దగ్గర నుంచి ఫోన్. ఒక అరగంటలో అపాయింట్మెంట్ ఉందనీ, రమ్మనీ.

కావ్యకి అప్పుడు నిజంగా పిచ్చి ఎక్కిపోయింది. ఆఖరి ప్రయత్నంగా ఆయాకి ఫోన్ చేసింది.

"ఫోన్ స్విచ్చాఫ్" అని వినిపించింది.

ప్రముఖ నటి, కుర్రకారుని ఓలలాడించే సినీతార, టాప్ హీరోలందరితో నటించే, బాక్సాఫీస్ హిట్లు ఇచ్చే కావ్య.. వేళ్లాడిపోతున్న కూతురును ఏం చేయాలో, డాక్టర్ దగ్గరికి ఎలా తీసుకెళ్లాలో తోచని పరిస్థితిలో పడిపోయింది.

నిస్సహాయంగా చూస్తూ కూర్చుంది.

ఇంతలో.. చాలా కాలం ముందు "ఒక పెద్ద హీరోయిన్‌గా అటువంటి క్లాస్ హీరోతో సినిమాలు చేయను" అని తిరస్కరించిన నటుడు శేఖర్. అతను వడివడిగా నడుచుకుంటూ కావ్య ఇంటి లోపలికి వచ్చాడు.

"కావ్యగారూ, నేను ఇటు వైపుగా రోడ్డు మీద నుంచి వెళుతూ మీరు పడుతున్న అవస్థ గ్రహించాను. నాకు ఇప్పుడు షూటింగ్ ఉంది. డైరెక్టర్‌కి ఫోన్ చేసి ఆలస్యం అవుతుందని చెప్పాను. పదండి డాక్టర్ దగ్గరికి వెళదాం.." అంటూ దివ్యని ఎత్తుకుని తన కారు వైపు నడిచాడు శేఖర్.

గతంలో శేఖర్‌తో తను ప్రవర్తించిన తీరుకి, అతని గురించి అన్న మాటలకి, ఇతరుల వద్ద అతనిని అకారణంగా చులకన చేయడానికి ప్రయత్నించినందుకు ఎంతో సిగ్గు పడిపోయింది, కావ్య.

ఆ క్షణంలోనే కావ్య కంటికి ఉన్న పొరలు తొలగిపోయాయి. శేఖర్‌కి అప్రయత్నంగా చేతులు జోడించింది. ●

---




కోర్టులో ఓ కేసు గురించి వాదోపవాదాలు జరుగుతున్నాయి.

"చెరువులను కబ్జా చేయడం ప్రజాసేవ ఎలా అవుతుంది?" అడిగాడు లాయర్ బోనులో వున్న వ్యక్తిని.

"నిజమే సార్! చెరువులు ఎక్కువగా ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. అందువల్ల డెంగ్యూ లాంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ప్రజారోగ్యం దృష్ట్యా చెరువుల కబ్జాలు తప్పనిసరి" అన్నాడు జవాబుగా.

ఆ జవాబు విన్న తరువాత జడ్జిగారితో సహా అంతా కళ్లు తేలేశారు.

**- కె.లహరి**

భార్య: లక్ష్మీ, నేను బస్టాండ్ వరకు వెళ్లొస్తాను.

భార్య: ఎక్కడికెళ్తున్నారు?

భర్త: ఫోన్ చార్జింగ్ పెట్టుకొని వస్తా.

భార్య: ఇంట్లో పెట్టుకోవచ్చుగా.

భర్త: మనింట్లో కరెంట్ బిల్లు ఎందుకు దండగా. అక్కడైతే ఫ్రీగా పెట్టుకోవచ్చుగా.

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

---

# రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# తేనెలొలికే 'తెలింగ్' ఎక్కడుంది?




**జయసూర్య**

తమిళ మహాకవి సుబ్రహ్మణ్యభారతి, తన జాతీయ ఐక్యతా గీతంలో 'సుందర తెలింగ్' అని తేనెలొలికే మన తల్లి పలుకుబడిని ప్రస్తావించారు. తమిళ సంస్కృతి, భాషా వికాసంలో తెలుగు అంతర్భాగం. సేవప్ప, అచ్యుతప్ప వంటి నాయక రాజుల కాలంనాటి 1500 తెలుగు తాళపత్ర సంపుటిలు, నేటికీ తంజావూర్ సరస్వతీ మహల్ గ్రంథాలయంలో పదిలంగా భద్రపరచబడి వున్నాయి.

స్వాతంత్ర్యానంతరం దేశీయ భాషలుగా తల్లి పలుకుబడికి ప్రాధాన్యం పెరిగింది. కానీ జాతీయ స్థాయిలో హిందీ, అంతర్జాతీయ స్థాయిలో ఆంగ్లం దేశ, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అందలం ఎక్కాయి. త్రిభాషా సూత్రం ప్రవేశించింది. రాజభాషగా హిందీకి పట్టాభిషేకం చేయాలనే ప్రయత్నాలు బాహాటంగా కొన్ని, గుట్టుచప్పుడు కాకుండా కొంత నడుస్తూనే వున్నాయి. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత, ఆంగ్లాన్ని దైనందిన వ్యవహారాల నిర్వహణ వెసులుబాటు కోసం ఉత్తరాది భాషగా హిందీని అనుసరించక తప్పటం లేదు.

ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిగా స్వదేశీయులు ఇంచుమించు అన్ని రాష్ట్రాల నుంచి భారీ వలసలు 21వ శతాబ్దంలో మరింత పెరుగుతున్నాయి. హిందీ తర్వాత అధిక సంఖ్యాకుల భాషగా వ్యవహరించబడే రెండవ స్వదేశీ భాష ప్రస్తుతం ఎక్కడుంది? అనే ప్రశ్న తల ఎత్తుతోంది.

తమిళులకున్న ప్రాంతీయ, భాషాభిమానం మనకు లేదనే విషయం నిర్వివాదాంశం. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో, తల్లిపలుకుకు అస్తిత్వం లేని రోజులలో పోతన, అన్నమయ్య, గోపన్న, త్యాగయ్య వంటి మహనీయులు తమకు తల్లి భాషాభిమానం స్పృహ లేకుండానే తెలుగును అఖండ భారతావనిలో అజరామరం చేసారు. హిందీయేతర రాష్ట్రాలపై హిందీని రుద్దే ఉత్తర భారత అధికార రాజకీయ ప్రాబల్యాన్ని, తమిళనాడు వ్యతిరేకిస్తూనే ఉంది.

భాషల ప్రాతిపదికన రాష్ట్రాలు ఆవిర్భవింపచేస్తే, దేశ సమైక్యత దెబ్బతిని, దేశం ముక్కలు చెక్కలవుతుందని 75 ఏళ్లనాటి జాతి నిర్మాతలు భావించి, స్వదేశీ భాషలను దశాబ్దాల తరబడి నిర్లక్ష్యం చేసారు. ఒకానొక సందర్భంలో నాటి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి 1968లో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది హిందీయేతర రాష్ట్రాలపై హిందీ రుద్దటానికి ప్రతిపాదించే త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తూ, మీరు హిందీలో సమాచారం పంపిస్తే మీకు నేను తమిళంలో ప్రత్యుత్తరం ఇస్తాను" అని హెచ్చరించారు.

తెలుగుల రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును ఏనాడో విస్మరించాం. వేలాది వందలకోట్ల వ్యాపారం చేసుకొంటున్న తెలుగు సినీ పరిశ్రమ ఎ.ఎన్.ఆర్. పుణ్యమా అని మద్రాస్ నుంచి తరలి వచ్చింది. ఎన్.టి.ఆర్. రాజకీయ కటాక్షంతో తెలుగుదేశం రాజకీయ పార్టీగా దేశాన్ని శాసించే నిలదీసే స్థాయిని దక్కించుకుంది. భాష మనుగడకు అవరోధాలు ఏర్పడితే జాతి నిర్మాణమే ఆగిపోతుందని తెలుగు మేధావులు గ్రహించాలి. సంకుచిత ప్రాంతీయ తత్వాల ప్రలోభాలకు లొంగకుండా భాషైక్యత ద్వారానే రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విలువలను సంరక్షించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమం రద్దుపై ప్రపంచ తెలుగు రచయితల నాలుగో మహాసభ ఆగ్రహం ప్రకటించింది. స్వభాషను రక్షించుకోవాలని, స్వాభిమానాన్ని చాటుకోవాలనే నినాదం తల ఎత్తింది.

తెలుగు సినిమా ఇటీవల అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించింది. తెలుగుపాట ఆస్కార్ పట్టాభిషేకం అందుకుంది. మేధావుల పత్రికలు, పుస్తకాలు, చలనచిత్రరంగమూ భాషాభిమానంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రశంసలు పొందుతోంది. సినీ ప్రముఖులు మరింతగా స్పందించి, సామాజికంగా జన సామాన్యులలో ప్రధానంగా నిరక్షరాస్యులలో తమ మాధ్యమం సృష్టించగల తల్లి పలుకబడి విలువలను పెంపొందింపచేయాలి. ఎంత వినోదం కోసం లాభ, నష్టాల వ్యాపారం అయినా సినిమాలకు ఆంగ్ల, అన్య భాషా శీర్షికల ప్రాచుర్యాన్ని అరికట్టుకోవాలి. సంభాషణలలో సాధ్యమైనంతగా తెలుగుతనం ఉట్టిపడాలి. ఇరుగు-పొరుగు రాష్ట్రాలలో వెల్లివిరుస్తున్న స్వభాషా చైతన్యాన్ని చిత్తశుద్ధితో అనుసరించాలి. ప్రభుత్వాలను మార్చగల శక్తి సంపన్నత, ఆకర్షణీయ వ్యామోహాలు కలిగిన చలన చిత్రరంగ ప్రముఖులు ఇప్పటికే రాజకీయ అధికారాన్ని శాసిస్తున్నారు. తెలుగుకు అపచారం జరగకుండా చలనచిత్రాలను నిరంతరం వీక్షించి ఆదరించే సినీ ప్రేక్షక లోకాన్ని ప్రభావితం చేయగల ఆలోచనలు కార్యాచరణ మనం చేపట్టగలమా?



అక్షరమాల అల్లికలో, వర్ణమాల వల్లె వేసే విశిష్టతలో తేనెలొలికే మాధుర్యం కలిగిన తెలుగు పలుకుబడి ప్రపంచ ప్రశస్తి పొందింది. కాని స్వరాష్ట్రంలో తెలుగులో మాట్లాడడం, తెలుగులో రాయడం, చదవడం, మాధ్యమంగా ప్రాథమిక బోధన విధిగా కొనసాగాలి. బాలబాలికలకు ఆసక్తి, ప్రోత్సాహం కలిగించే చర్యలు ప్రభుత్వం, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు చిత్తశుద్ధితో చేపట్టాలి.

"తెలుగు ఎవ్వరి పాలు చేసి తిరిగెదవు ఆంధ్రా" అన్న వేటూరి శివరామశాస్త్రి వంటి సాహితీవేత్తల ఆవేదన మనకు అర్థం అవుతుందా?" ■

# బ్లూ జావా అరటిపండ్లు

యామిజాల జగదీశ్



**వనిల్లా కస్టర్డ్ ఐస్ క్రీం గుర్తుకొచ్చే రుచి... బ్లూ జావా అరటిపండు. ఇది కొత్త రకం అరటిపండు. అరటిలో వందల రకాలున్నాయి. వాటిని యాభై రకాలుగా విభజించారు.**

**ఎలాగంటే- విత్తనాలు లేదా విత్తన రహితమైనవి, విస్తృత శ్రేణి పరిమాణాలు, ఆకారాలు, రంగులతో కూడిన పండ్లుగా విభజించారు.**

కొన్ని అరటిపండ్లు యాభై సెంటీమీటర్ల పొడవుంటే మరికొన్ని అంతకన్నా తక్కువ పొడవుంటాయి. అడవి అరటి రకాలలోకి మూసా అక్యుమినాటా, మూసా బాల్బిసియానా వంటివి వస్తాయి. అలాగే వాణిజ్య అరటి రకాలుగా ట్రిప్లాయిడ్ వంటి వాటిని పేర్కొంటారు. అయితే చాలా అరటిపండ్లు మూసా అక్యుమినాటా, మూసా బాల్బిసియానా, ఎఎబి, లేదా ఎబిబి రకాలు. ఉష్ణమండలం ఎగుమతులయ్యే వాటిలో కావెండిష్ రకం అధికం. వీటిలోనే పొడుగు, పొట్టి రకాల అరటిపండ్లున్నాయి.

## గ్రాస్ మిచెల్

ఇవి ఆకర్షణీయమైన రంగులో పండవుగా ఉంటాయి. ఈ రకం అరటిపండు రుచిగా కూడా ఉంటుంది. అరటి పండ్లలోనే కొన్ని అత్యంత ప్రజాదరణ పొందిన రకాలున్నాయి. అవి: బ్లగ్గో, పిసంగ్ అవాక్, హోర్టన్, కుర్రేరే.

ఇలా రకరకాల అరటిపండ్ల గురించి చెప్పుకుంటూ పోతే ఇక్కడ చోటు చాలదు. కనుక ప్రత్యేకించి ఒక రకం అరటి పండు గురించి తెలుసుకుందాం..

గత కొంత కాలంగా ఓ కొత్త రకం అరటిపండు మన ముందుకొచ్చింది. దాని పేరు బ్లూ జావా. అంటే పేరుకు తగ్గట్టే నీలం రంగు తొక్కతో ఉండే పండు. తొక్క నీలం రంగులో ఉంటే లోపం క్రీం కలర్‌లో ఉండి తింటున్నంతసేపూ వనిల్లా కస్టర్డ్ ఐస్‌క్రీం గుర్తుకొస్తుందట. చూడటంతోనే ఆకట్టుకునే ఈ పండుకున్న ప్రత్యేకత దాని రుచి.. అంటున్నారు శాస్త్రవేత్తలు. దీని రుచి మధురాతి మధురమని తిన్నవారి మాట.

అయితే ఈ రకం అరటిపండ్లు దొరకడం అరుదు. అవి అన్ని ప్రాంతాల్లో లభించవు. ఇది మొట్టమొదటగా ఆగ్నేయాసియాలో ఉద్భవించిన హైబ్రిడ్ అరటి చెట్టు. హవాయి, ఇతర పసిఫిక్ దీవులలో కూడా ఈ పండ్లు సహజంగానే పెరుగుతుండటం గమనార్హం.

ఈ రకం అరటిపండ్లకు ఐస్‌క్రీం 'అరటి' అని కూడా పేరు ఉంది. ఎందుకంటే ఈ పండు ప్రత్యేకమైన రుచి, స్థిరత్వాన్ని కలిగి ఉంటుంది. ఫిజీలో వీటిని 'హవాయి బనానా' అని పిలుస్తారు. ఫిలిప్పీన్స్‌లో వీటిని 'క్రీ' అని, మధ్య అమెరికాలో 'సెనిజో' అని అంటారు.

ఈ నీలి రంగు జావా అరటిపండ్లు, సీడెడ్ అరటిపండ్లు, మూసా అక్యుమినాటా, మూసా బాల్బిసియానా ట్రిప్లాయిడ్ హైబ్రిడ్ రకం బ్లూ జావా అరటిచెట్లు 15 నుండి 20 అడుగుల ఎత్తువరకు పెరుగుతాయి. ఈ చెట్లు ఆకులు వెండి-ఆకుపచ్చ రంగులో ఉంటాయి. అలాగే అవి సరైన పెరుగుదలకు 40 డిగ్రీల ఫారెన్ హీట్ ఉష్ణోగ్రత అవసరం.

అయితే ఒక్క విషయం... ఈ అరటికాయలు పండగానే మామూలు పసుపు రంగు తొక్కనే కలిగి ఉంటాయి. ఈ రకం అరటిపండ్లలో పోషక పదార్థాలు మెండుగానే ఉన్నాయట. విటమిన్లు సి, బి6 ఉన్న ఈ అరటి పండ్లలో ఐరన్, పాస్ఫరస్, థియామిన్, సెలినియం వంటివి కలిసుండటం విశేషం. ఒక గెలలో వంద పండ్లదాకా ఉంటాయి. పండు 18 నుండి 23 సెంటీమీటర్లు (7 నుండి 9 అంగుళాలు) పొడవు ఉంటుంది. ఈ రకం మొక్కను నాటిన తర్వాత 15-24 నెలల తర్వాత వికసిస్తాయి. 115 నుండి 150 రోజుల తర్వాత కోతకు వస్తాయి.

అరటిపండ్లు మనిషి పిడికిలిని పోలి ఉండటం వలన వీటిని 'నకిల్స్' అని పిలుస్తారు. బ్లూ జావా అరటిపండ్లను అలాగే తినొచ్చు లేదా ఉడికించి కూడా తినవచ్చట.





# జీవిత లెక్క

**సింగిల్ పేజీ కథ**

ఓట్ర ప్రకాష్ రావు

**రోజు పదవ తరగతి బాలికలకు పాఠశాలలో ఆఖరి రోజు.**

**ఆఖరి పీరియడ్‌కు హెడ్మాస్టరు గీతాంజలి వచ్చారు.**

**హెడ్మాస్టర్ గీతాంజలి లెక్కల సబ్జెక్టు తీసుకొంటుంది. ఆ బడిలో లెక్కల పరీక్షలో అందరూ మంచి మార్కులు తెచ్చుకోవడానికి గీతాంజలి కారణం. అందరికీ అర్థమయ్యేలా లెక్కలు చెప్పడం ఆమె ప్రత్యేకత.**

ఆఖరి రోజు క్లాసుకు వచ్చిన గీతాంజలి మేడం లెక్కల పరీక్షలో రావడానికి అవకాశమున్న లెక్కలను చెబుతారని విద్యార్థినులు ఆశించారు.



"ఈరోజు మీకిది ఆఖరి రోజు. ఈ చివరి రోజు మీకు జీవిత లెక్క చెబుతాను. మీ చదువులు అంటే డిగ్రీ పూర్తయ్యాక ఎంతమంది ఉద్యోగం చెయ్యాలనుకొంటున్నారు" అడిగారు.

"చాలా మంది విద్యార్థినులు చేతులు పైకెత్తారు.

"మీ ఉద్యోగాన్ని కాపాడుకోవాలంటే ఎలా పని చేయాలి?"

"నిజాయితీతో శ్రద్ధతో ఏకాగ్రతతో.." ఒక విద్యార్థిని.

"మీలో ఎక్కువ శాతం పని చేసేది ఐటీ నందు చేరడానికి ప్రయత్నిస్తారు. ఎందుకంటే ఎక్కువ జీతం ఇస్తారు. ఆ ఉద్యోగంలో మీరు సరిగ్గా పని చేయకుంటే వెంటనే ఆ ఐటీ కంపెనీవారే మిమ్మల్ని ఉద్యోగం నుండి ఇంటికి పంపిస్తారు. ఆ ఉద్యోగంలో చేరాలంటే మీరు తప్పకుండా నిజాయితీతో శ్రద్ధతో పని చేస్తారు" అంది.

"అలా పని చేయడం వలన మా ఉద్యోగం నిలకడగా ఉంటుంది మేడం" అంది ఒక విద్యార్థిని.

"మీ ఉద్యోగం నిలకడగా ఉండాలంటే కావలసింది, ముఖ్యమైనది శారీరక-మానసిక ఆరోగ్యం.

ఇప్పుడు ఐటీలో పని చేస్తున్నవారు నెలకు లక్ష పైచిలుకు సంపాదిస్తున్నవారు ఎంతో మంది ఉన్నారు. వారిని గమనించండి.

సంపాదన బాగున్నా శారీరక వ్యాయామం లేక అనారోగ్యం, నిదుర లేక మానసిక ఆందోళనలకు గురి అవుతున్నారు. వారు ఎంత కాలం పని చేస్తారో ఆలోచించండి. మనిషి ప్రతిరోజూ ఆహారం తిన్నట్లు ప్రతిరోజూ కొంత సమయం అయినా వ్యాయామం చెయ్యాలి".

అందరూ "సరేనన్నట్లుగా.." తల ఆడించారు.

"మా దూరపు బంధువు మూర్తి గారు అని పోలీసు అధికారి ఉన్నారు. ఆయన అప్పుడప్పుడు తన ప్రసంగంలో నేటి తరానికి అవగాహన కల్పించడం కోసం ఒక జీవిత లెక్క చెప్పేవారు. ఆ లెక్కకు మీరు సమాధానం చెప్పగలరా చూద్దాం...! అడగమంటారా?" అడిగింది గీతాంజలి.

"అడగండి మేడం" అన్నారు విద్యార్థినిలు.

"మూర్తి గారు డాక్టర్స్ సమావేశంలో "ది శార్టెస్ట్ రూట్ టు ద గ్రేవియార్డ్ ఈజ్ ఎక్స్ రసైజ్" అంటారు. అంటే శ్మశానానికి దగ్గర దారి వ్యాయామం.

విద్యార్థినీలందరూ ఉలిక్కిపడ్డారు.

"మేడం! వ్యాయామం శ్మశానానికి దగ్గర దారి ఎలా ఔతుంది?"

"ఇదే ప్రశ్న ఆ సభలో ఒకరు అడిగితే ఆయన ఏం చెప్పారో తెలుసా?

"వ్యాయామం చేసేవాడు ఆసుపత్రికి వెళ్లకుండా చస్తాడు. ఇంటి నుంచి నేరుగా శ్మశానానికి వెళ్తాడు; వ్యాయామం చేయనివాడు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లి, ఆ తరువాత శ్మశానానికి వెళ్తాడు. ఇదే నేను చెప్పాలనుకున్న జీవిత లెక్క".

మీరు ఈ లెక్కను మీ జీవితానికి సరిగ్గా అనుసరిస్తే చాలు.. మీ జీవితంలో ఉద్యోగం, ఆరోగ్యం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా వెళ్తుంది" అంది హెడ్మాస్టర్ గీతాంజలి.

ఇక మీదట ప్రతిరోజూ తప్పనిసరిగా శారీరక వ్యాయామం చేయాలని చాలామంది మనసులో దృఢంగా నిర్ణయించుకొన్నారు.

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.**

**మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

**sunmagvaartha@gmail.com**

# ఆహా! భలే గాజు వంతెనలు

షేక్ అబ్దుల్ హాకీం జాని



పలు నగరాలు, దేశాల మధ్య దూరాన్ని తగ్గించి రవాణా వ్యవస్థను పటిష్టం చేసుకోవడానికి, త్వరగా గమ్యం చేరడానికి ఎన్నో వంతెనలు నిర్మించారు. ఇదే రీతిలో ప్రకృతి అందాలు తిలకించడానికి ఆధునిక పోకడలతో గాజు వంతెనలు నిర్మించిన దేశాలు అనేకం ఉన్నాయి. వీటిపై నడుస్తుంటే గాల్లో తేలుతున్న అనుభూతి కలుగుతుంది. అందుకే వీటిని స్కైవాక్ బ్రిడ్జిలు అని పిలుస్తారు. గాజు వంతెనపై నడక అనేది సాహసమే అని చెప్పాలి. గాజు వంతెనలపై గుండె ధైర్యంతో కొందరు పర్యాటకులు నడుస్తూ అలౌకిక ఆనందాన్ని పొందుతుంటారు.

గాజువంతెన అంటే చిటికెలో పగిలిపోయే గాజు కాదు సుమా! రెండు కొండల మధ్య నిర్మించిన ఈ గాజు వంతెనపై పర్యాటకులు ధైర్యంగా నడుస్తూ, గాల్లో తేలుతున్న అనుభూతిని పొందుతూ ప్రకృతి సోయగాలను ఆస్వాదిస్తున్నారు. ఇవి చాలా దృఢంగా ఉంటాయనే నమ్మకం కలిగించేందుకు కొన్ని గాజు వంతెలనపై కార్లు నడిపిన సందర్భాలు కూడా ఉన్నాయి.

### వియత్నాం గాజు వంతెన

గాజు వంతెన పేరు చెప్పగానే అందరికీ వియత్నాం గుర్తుకు వస్తుంది. వియత్నాంలో ప్రపంచంలోనే అత్యంత పొడవైన గాజు వంతెనను సోన్లా ప్రావిన్స్‌లోని ఉత్తర హైలాండ్స్ టౌన్ మోక్ చౌ ఐలాండ్ అనే ప్రాంతంలో నిర్మించారు. వైట్ డ్రాగెన్ బ్రిడ్జిగా పిలిచే ఈ గాజు వంతెన పొడవు 632 మీటర్లు. వెడల్పు 2.5 మీటర్లు. 150 మీటర్లు లోతైన లోయపై ఈ గాజు వంతెనను నిర్మించారు. వియత్నాంలో ఇది మూడో గాజు వంతెన. అయితే ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పారదర్శక గాజు వంతెనగా ప్రసిద్ధి చెందింది. ఈ వంతెనకు 'బాచ్ లాంగ్' అని నామకరణం చేశారు. వియత్నాంలోని సోన్లా ప్రావిన్స్‌లోని బాచ్ లాంగ్ బ్రిడ్జ్ ప్రపంచంలోని అతి పొడవైన గాజు వంతెనగా నిర్ధారించారు. ఫ్రాన్స్ నుండి దిగుమతి చేసుకున్న ప్రత్యేకమైన గాజుతో దీన్ని నిర్మించారు. సెయింట్ గోబైన్ అనే ఫ్రాన్స్ కంపెనీ ఉత్పత్తి చేసి ఇచ్చిన సూపర్ టెంపర్డ్ గ్లాస్‌తో బ్రిడ్జిని తయారు చేశారు. ఒకేసారి 450 మంది దీనిపై నడిచినప్పటికీ ఆ బరువును తట్టుకునే సామర్థ్యంతో దీన్ని నిర్మించారు.


290 మీటర్ల ఎత్తైన రెండు శిఖరాల మధ్య దీన్ని నిర్మించారు. వంతెన చాలా ఎత్తులో ఉండటం వల్ల లిఫ్ట్ ద్వారా వంతెనను చేరుకుని అక్కడి నుండి పర్యాటకులు దీనిపై నడుస్తారు. 28 ఏప్రిల్ 2022లో పర్యాటకుల కోసం దీన్ని తెరిచారు. ఇది వియత్నాం రాజధాని హనోయికి వాయువ్యంగా 200 కి.మీ. దూరంలో లావోస్ సరిహద్దులో ఉంది.

### అరుదైన గాజువంతెన

చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్‌లో నిర్మించిన 'రూయి' అనే వంతెన ప్రజలను అబ్బురపరుస్తోంది. దానిని చూసిన ప్రజలు ఇది నిజమేనా అని షాక్ అవుతున్నారు. కారణం ఆ వంతెన వింతగా మెలికలతో నిర్మించడమే. భూమి ఉపరితలానికి 140 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ గాజు వంతెనను డీఎన్ఏ కణం ఆకారంలో నిర్మించారు.

ఈ గాజు వంతెన ప్రపంచ దేశాల ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. 100 మీటర్ల పొడవైన ఈ గాజు వంతెనను 140 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో జెజియాంగ్ ప్రావిన్స్‌లోని తైజా నగరంలోని షెంజియాంజు సరిహద్దుల్లో నిర్మించారు. వంతెన రెండు భాగాలు ఒకదానితో ఒకటి కలుసుకుని, విడిపోయి, మెలికలు తిరిగినట్లుగా ఉంటుంది. 2017లో ఈ వంతెన నిర్మాణం చేపట్టగా, 2020లో ప్రారంభించారు. ఈ వంతెనను ప్రారంభించింది మొదలు పర్యాటకులు పెద్ద ఎత్తున అక్కడికి వస్తున్నారు. దీనిని చూసి ప్రజలు సంభ్రమాశ్చర్యానికి గురై, బెండింగ్ గాజు వంతెనను చూసి మురిసిపోతున్నారు. ఆ గాజు వంతెనపై నడుస్తూ అలౌకికానందాన్ని పొందుతున్నట్లు ప్రపంచ పర్యాటకులు చెబుతున్నారు. ఈ వంతెనపై నడుస్తుంటే ఆకాశంలో ఇంద్రధనస్సు పై నడుస్తున్నామా? అనే అనుభూతి కలుగుతుంది. రూయి వంతెన డిజైన్‌ను చూసి ఇది కంప్యూటర్‌లో రూపొందించిన చిత్రమని చాలా మంది నమ్మలేదు. అసలు ఈ విధంగా నిర్మించడం సాధ్యమేనా? అని మరికొందరు నెటిజన్లు సందేహం వ్యక్తం చేశారు. అ

అయితే 2020 నవంబరు నెలలో కెనడియన్ వ్యోమగామి క్రిస్ హాడ్ఫీల్డ్ 'రూయి' వంతెనకు సంబంధించి ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దాంతో ఆ వంతెన కంప్యూటర్ గ్రాఫిక్స్ కాదు, నిజమైన వంతెనే అని అందరూ నిర్ధారించుకున్నారు.





## జాంగ్జియాజీ గాజువంతెన

జాంగ్జియాజీ గ్లాస్ వంతెన అనేది వులింగ్‌యువాన్ ప్రాంతం పైన హునాన్‌లోని జాంగ్జియాజీలో స్కైవాక్ వంతెనగా ప్రసిద్ధి చెందింది. ఇది పాదచారుల వంతెన. దీనిని జాంగ్జియాజీ గ్రాండ్ కాన్యన్ గ్లాస్ బ్రిడ్జి అని అంటారు. ఈ వంతెన గ్లాస్ అడుగున, పారదర్శకంగా ఉంటుంది. ఇది తెరిచిన ప్రారంభంలో ప్రపంచంలోనే అతి పొడవైన గాజు వంతెనగా ప్రసిద్ధి చెందింది. వియత్నాంలో ఇంతకంటే పొడవైన గాజు వంతెనను నిర్మించడంతో దీని స్థానం మారింది. ఈ వంతెన మొత్తం పొడవు 430 మీటర్లు, వెడల్పు 6 మీటర్లు, భూమి నుండి 360 మీటర్ల ఎత్తులో నిర్మించారు. హునాన్ ప్రావిన్స్‌కు వాయువ్యంగా ఉన్న జాంగ్జియాజీ నేషనల్ ఫారెస్ట్ పార్క్‌లోని రెండు పర్వత శిఖరాల మధ్య జాంగ్జియాజీ గ్రాండ్ కాన్యన్ గ్లాస్ బ్రిడ్జిని నిర్మించారు. ఒకేసారి 800 మంది పర్యాటకులు నడిచేలా దీన్ని రూపొందించారు. వందలాది అడుగుల లోయ పైన, కొండ అంచున గాజు వంతెనపై నడుస్తున్నప్పుడు బెరుకుతో కూడిన ఉత్సాహం ఉరకలేస్తుంది. ఈ వంతెనను ఇజ్రాయెల్ ఆర్కిటెక్ట్ హైమ్ డోటాన్ రూపొందించారు.

## వోంగ్యాగు గాజువంతెన

ఇది చైనాలోని చాంగ్‌కింగ్‌లో ఉంది. ఈ వంతెన ప్రపంచంలో మూడవ అతి పొడవైన గాజు వంతెనగా ప్రసిద్ధి చెందింది. దీని పొడవు 418 మీటర్లు, వెడల్పు 6.6 మీటర్లు. అతి బలమైన పారదర్శక గాజు అద్దాలను దీని నిర్మాణంలో ఉపయోగించారు. ఆ కారణంగా వెయ్యి మంది వరకు ఈ వంతెనపై ఒకేసారి నడవగలరు. అయినప్పటికీ 500 మందికే అనుమతిస్తున్నారు. 22 మే 2020న దీన్ని పర్యాటకుల సందర్శనార్థం ప్రారంభించారు.

## కాపింగ్ గ్లాస్ బ్రిడ్జ్

దీన్ని చైనాలోని యాండాంగ్ మౌంటైన్ సీనిక్ ప్రాంతంలో నిర్మించారు. ఇది ప్రపంచంలో అయిదవ పొడవైన గాజు వంతెన. 15 జులై 2020లో పర్యాటకుల కోసం ప్రారంభించారు. దీన్ని 16 నెలల కాలంలో నిర్మించారు. ఈ వంతెన పొడవు 300 మీటర్లు, వెడల్పు 16 మీటర్లు. దీనిపై ఒకేసారి 400 మంది నడవగలరు. అయితే 300 మందికి మాత్రమే అనుమతిస్తారు.

## లంకావి స్కై బ్రిడ్జ్

మలేషియాలోని లంకావి స్కై బ్రిడ్జ్ ఈ వంతెన మలేషియాలోని లంకావి ద్వీపంలో ఉంది. ఇది ప్రపంచంలో నాల్గవ పొడవైన గాజు వంతెన. దీని పొడవు 400 మీటర్లు, వెడల్పు 1.8 మీటర్లు. దీనిపై 200 మంది ఒకేసారి నడవగలరు.



గునుంగ్ మాట్ చిన్‌చాంగ్ వద్ద రెండు కొండ శిఖరాలను కలుపుతూ ఈ గాజు వంతెనను నిర్మించారు.

## భారతదేశంలో..

భారతదేశంలో అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసే గాజు వంతెనలు పలు ప్రాంతాలలో నిర్మించారు. సిక్కిం రాష్ట్రంలోని పెల్లింగ్ నగరంలో నిర్మించిన గాజు వంతెన మన దేశంలో తొలి స్కైవాక్ వంతెన. సముద్ర మట్టానికి 7200 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ వంతెనను 2018లో ప్రారంభించారు. ఈ వంతెనపై నడుస్తూ హిమాలయాల సోయగాలను చూస్తూ పర్యాటకులు మైమరచిపోతుంటారు. మరో గాజు వంతెన బీహార్ రాష్ట్రంలోని రాజ్‌గిరిలో నిర్మించారు. 250 అడుగుల ఎత్తులో, 85 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పుతో దీన్ని నిర్మించారు.

## వాగమోన్ గాజువంతెన

ఇది కేరళలోని ఇడుక్కి జిల్లా,



వాగమోన్, కోలాహలమేడులో నిర్మించిన స్కైవాక్ గాజు వంతెన. 40 మీటర్ల పొడవుతో ఈ వంతెన ఇడుక్కి జిల్లాలో అతి పొడవైన కాంటిలివర్ గాజు వంతెన. ఇది ఇడుక్కి జిల్లా టూరిజం ప్రమోషన్ కౌన్సిల్, అడ్వెంచర్ పార్కులో చొరవతో నిర్మించబడింది.

ఈ వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు ఖర్చు చేశారు. వాగమోన్ గాజు వంతెన కేరళలో మొదటి గాజు వంతెన. జర్మనీ నుండి దిగుమతి చేసుకున్న 40 మిమీ గ్లాస్ ఇది. దీనిని ఐదు పొరలతో తయారు చేసారు. 35 టన్నుల ఉక్కును ఈ నిర్మాణంలో వాడారు. డిటిపిసి ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ వంతెనను నిర్మించారు. ఇక్కడ నుండి కూట్టిక్కల్, కొక్కయార్, ముండక్కాయం వంటి ప్రదేశాల సుదూర దృశ్యాన్ని చూడవచ్చు.



# గురుపౌర్ణిమ వైశిష్ట్యం

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

గురుబ్రహ్మ
గురువిష్ణు గురుదేవో మహేశ్వరః ।
గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై
శ్రీగురవేనమ ॥

మనం ఈ భూమ్మీద పుట్టినప్పటి నుండీ ప్రతి క్షణం ఏదో ఒకటి నేర్చుకుంటూనే వుంటాం. మొట్టమొదటగా మనకు లభించిన గొప్ప గురువు మన మాతృమూర్తి. అమ్మే అందరికీ మొదటి గురువు. మనకు మాటలు రానప్పటి నుండీ ఆమె నుండి మనం నేర్చుకుంటూనే వున్నాం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కలగలసిన రూపమే గురువు. అందువలననే మనం మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ అంటున్నాం.

మాతాపితరుల తర్వాత అంతటి స్థానాన్ని మనం గురువుకే ఇచ్చాం మన జీవితంలో. గురువులను, ఉపాధ్యాయులను, పెద్దలను గురుపౌర్ణమి రోజున పూజించుకుంటాం, గౌరవించుకుంటాం.

ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమి పండుగను జరుపుకుంటాం. మన జీవితానికి మార్గం నిర్దేశించి, మనలను అజ్ఞానం నుండి జ్ఞాన మార్గం వైపు నడిపించి, జీవితాన్ని సార్థకం చేసుకునేలా చేసిన గురువులకు మనం ఎంతో రుణపడి వున్నాం.

ఈ రోజునే వ్యాసులవారి పుట్టినరోజు. వ్యాసభగవానుడు మానవాళికి ఆధ్యాత్మిక జ్ఞానాన్నీ, వారసత్వాన్నీ అందించాడు. అందుకే వ్యాసుని గురువుగా భావించి గురుపౌర్ణమి రోజును జరుపుకుంటున్నాం. వీరి పూర్వ నామం కృష్ణద్వైపాయనుడు. వేదాలను నాలుగు భాగాలుగా విభజించి అందించినవారు కాబట్టి వేదవ్యాసుడు అంటూ గౌరవంగా.. భక్తిపూర్వకంగా పిలుచుకుంటున్నాం.

హిందువులు పూజించే ఆధ్యాత్మిక శిఖర గ్రంథాల్లోని మహాభారతాన్ని వేదవ్యాస స్వామివారే అందించారు. ఈ లోకాలన్నింటికీ మహత్తర లోకైక గురువు శ్రీకృష్ణ పరమాత్మ.

ఇక షిర్డీ సాయిబాబా వారిని గురువుగా పూజిస్తూ, విశేషంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు గురుపౌర్ణమి రోజున నిర్వహిస్తారు చాలామంది. గురుపౌర్ణమి ఒక విధంగా గురుశిష్యుల సంబంధాలకు ఒక చిహ్నంగా మారింది. ఒక సత్ సంప్రదాయంగా హిందువులకూ, బౌద్ధులకూ, జైనులకూ, శిక్కులకు కూడా మారింది. ధర్మమార్గాన్ని, నీతినీ, నిజాయితీని బోధించిన విశిష్టమైన గురువులకు తమ



అకుంఠితమైన కృతజ్ఞతను, ప్రేమను, అభిమానాన్ని వ్యక్తపరిచే ఒక మత పరమైన గుర్తింపును పొందింది ఈ గురుపౌర్ణిమ. అనేక రకాల సంప్రదాయాలకు ఒక మార్గం వేసిన మన భారతదేశపు గురువులైన ఆదిశంకరాచార్య, శ్రీమత్ రామానుజాచార్యా, రమణమహర్షి, శ్రీరామకృష్ణ పరమహంస వంటి మహాత్ములకు చేతులు జోడించి మనం మనఃపూర్వక కృతజ్ఞతా పూర్వక వందనాలు సమర్పించుకోవాల్సి వుంది. బౌద్ధులు బుద్ధదేవుణ్ణి, శిక్కులు గురునానక్‌ను అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ రోజున విశేషంగా పూజించి తమ భక్తి శ్రద్ధలను ప్రకటించుకుంటారు.

సాయిబాబావారి సంస్థల్లోనివారు మానవసేవే మాధవసేవగా, ప్రేమే దైవం అన్న భావాలను గురువు ఉపదేశంగా స్వీకరించి మహత్తర కృషి చేస్తూ ఈ రోజున భక్తిపూర్వక, ప్రేమపూర్వక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

హరేకృష్ణ ఉద్యమ కార్యనిర్వాహకులైన స్వామి ప్రభుపాద శిష్యగణం గురుపౌర్ణమిని అత్యంత శోభాయమానంగా జరుపుకుంటున్నారు. విశేషంగా గురువుల పేరిట అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తూ తమ గురువులకు కృతజ్ఞతా భావాన్ని ప్రకటించుకున్నారు.

గురుపౌర్ణమి రోజున భారతదేశంలో వాడవాడలా తమ గురువులను సత్కరించుకుంటూ– కానుకలు, బహుమతులూ సమర్పించుకుని వారి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు.

కొందరు ఆధ్యాత్మిక గురువులతో కుటుంబ సంబంధాలను పెట్టుకుంటూ ఈ రోజున వారికి పూజలు గావిస్తూ గౌరవించుకుంటున్నారు. ఈ రోజునే ఆదియోగి, ఆది గురువైన మహాశివుడు సప్తరుషులకు జ్ఞానబోధ చేసాడు. ఈ పౌర్ణమినాడే దత్తాత్రేయుడు తన శిష్యులకు జ్ఞానబోధ చేసాడని చెబుతారు.

ఇంత విశిష్టత కలిగిన ఈ గురుపౌర్ణిమ రోజునే శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాన్ని జరుపుకుంటారు మరికొందరు భక్తులు. ఇంకొందరు ఉపవాసం ఉంటారు, శ్రద్ధాభక్తులతో గురు నామస్మరణం గావిస్తారు. సర్వ దేవతా స్వరూపమైన గురుదేవులకు నమస్కరించుకుందాం.

**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**

**సెల్స్: 9885446501/9885449458**




# జ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలి?

**ఎ.కార్తిక్ – హైదరాబాద్**

**ప్రశ్న: ఒకే విషయాన్ని లేదా జ్ఞానాన్ని మంచికీ, చెడుకి కూడా ఉపయోగించ వచ్చు.. అంటున్నారు. అలాంటి విషయం ఏదైనా వాస్తు శాస్త్రంలో ఉందా?**

**జవాబు:** ప్రతి గ్రంథంలోనూ మనం తెలుసుకోవాల్సినవి ఉంటాయి. జ్ఞానానికి సంబంధించి కనుక్కున్న ఎన్నో విషయాలు ఉన్నాయి. అవి జ్ఞానులకు తెలిస్తే వాటిని లోక కళ్యాణార్థం ఉపపయోగిస్తారు. మరొకరి చేతిలో పడితే వాళ్లు మనకు ప్రతికూలంగా ఉపయోగించవచ్చు. ఉదాహరణకి అణ్వస్త్రానికి సంబంధించిన విషయాలున్నాయి. మన భారతదేశం దాని గురించి రీసెర్చ్ చేసి దాని ఫార్ములాను కనుక్కున్న తర్వాత, మన దేశపు ఒక సైంటిస్ట్‌ని పాకిస్తాన్ దేశపు ఒక అమ్మాయి 'హనీ ట్రాప్' చేసి ఆ సైంటిస్ట్‌ని వశం చేసుకొని, ఆ అణ్వస్త్ర ఫార్ములా విషయాలను పాకిస్తాన్‌కి అందజేసింది అనుకోండి.

మన రక్షణ కోసం తయారు చేసి పెట్టుకుంటే ఇంకొకడు దొంగతనం చేసాడు. మన దగ్గర ఒక శక్తి ఉంటే శత్రువు భయపడతాడు. మన దగ్గర ఉన్న లాంటి శక్తి, వాడు కూడా తయారు చేసుకోగలిగితే వాడు మనకి భయపడడు కదా! జరిగింది అదే.

ఇటువంటి సమస్య ఇప్పుడు ప్రపంచంలో కొత్తగా వచ్చిందేమీ కాదు. వేద కాలం నుండి ఈ సమస్య ఉంది. బ్రహ్మదేవుని నాలుగు ముఖాల నుండి నాలుగు వేదాలు ఉద్భవిస్తాయి. వాటిని ఒక రాక్షసుడు తస్కరిస్తాడు. అనంతమైన జలనిధి లోతుల్లో ఎక్కడో పోయి దాక్కుంటాడు.

విష్ణుమూర్తి దశావతారాల్లో మొదటిదైన 'మత్స్యావతారం' ఎత్తి జలనిధిలో దాక్కొని ఉన్న ఆ రాక్షసుడిని పట్టుకొని సంహరించి, ఈ వేదాలన్నింటిని కూడా తీసుకువచ్చి మళ్లీ బ్రహ్మదేవుడికి అప్పగిస్తాడు.

వేదాలు అంటే జ్ఞానం. రకరకాల జ్ఞానాన్ని అంటే.. ఔషధాలు, ఆరోగ్యం, అస్త్రశస్త్రాలు.. ఇలా ఎన్నో జ్ఞాన పరంపరమైన విషయాలు ఉంటాయి. వీటిని రాక్షసులు సంగ్రహించి, ఆ జ్ఞానాన్ని ఉపయోగించుకోగలిగితే వాళ్లకి దేవతలు భయపడవలసి వచ్చేది. ఇలా ఒకరు సముపార్జన చేసిన జ్ఞానాన్ని మరొకరు తస్కరించి భయపెట్టడం అనే విషయం అప్పటినుండే ఉంది.

అందువల్ల ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మనం సంపాదించి పెట్టుకున్న జ్ఞానం, మనకి అపకారం చేయాలనుకునే వాళ్లకి దొరకకుండా మనం జాగ్రత్త పడటం తప్పనిసరి. ఈ శాస్త్రాల్లో అందరికీ అన్ని దొరుకుతాయి. కానీ వాటిని ఎలా ఉపయోగించుకుంటారో మనకు తెలియదు.

వేదాలలో ఒక భాగం జ్యోతిష్య శాస్త్రం. జ్యోతిష్య శాస్త్రంలో 'వాస్తు శాస్త్రం' అనేది ఒక చిన్న సంహిత. ఇందులో ఎన్నో వాస్తు విషయాలు, నియమాలు ఉంటాయి. అన్నీ అందరికీ లభ్యమవుతాయి. కానీ అన్ని విషయాలు అందరూ ఒకేలాగా ఉపయోగించుకోరు. ఉదా: వాస్తులో ఒక విషయం ఉంది అనుకుందాం. అదేమిటంటే.. ఈశాన్యం గదిని పడక గదిగా ఉపయోగించుకోకూడదు. 'కొత్తగా పెళ్లి అయిన భార్యా భర్తలకి ఈశాన్యం గదిని పడకగదిగా ఇస్తే ఫలితాలు మరీ దారుణంగా ఉంటాయి. అపార్థాల వలన విడాకులదాకా వెళ్లొచ్చు... అని వాస్తు శాస్త్రంలో ఉన్నదనుకోండి. మరి.. ఇవన్నీ తెలిసినప్పుడు కొత్తగా పెళ్లయిన



దంపతులకు ఆ గదిని బెడ్ రూమ్‌గా ఇవ్వకూడదు కదా! టీవీ డైలీ సీరియల్స్‌లో ఇలా వస్తూ ఉంటాయి. ఈ విషయం తెలుసుకున్న ఒక అత్తకి కోడలు అంటే ఇష్టం లేక కొడుకుని, కోడల్ని విడదీసే ఉద్దేశంతో ఈశాన్యం గదిని పడక గదిగా ఇస్తుంది. వాళ్లు 'ఎప్పుడు విడిపోతారా?' అని ఎదురు చూస్తూ ఉంటుంది. ఇట్లాంటివి తెలుసుకొని మంచికీ, చెడుకి కూడా ఉపయోగించుకోవచ్చు.

గురువులు శిష్యులకి ఈ శాస్త్రాలు నేర్పేటప్పుడు వాళ్లకున్న 'విద్వత్తు'ను చూస్తారు. 'స్వభావాన్ని' పరీక్షిస్తారు. శిష్యులకి నేర్చుకోవటానికి 'అర్హత' ఉన్నదా? లేదా? అని చూస్తారు. అప్పుడు బోధించడం మొదలు పెడతారు. కొందరు శిష్యుల స్వభావం బాగుండదు. అట్లాంటివారికి ఇట్లాంటి శాస్త్రాలు నేర్పించడం వల్ల సమాజానికి ప్రయోజనం ఉండదు. పైగా హాని కలుగచేస్తారు. శాస్త్రంలో అనేకానేక విషయాలు ఉంటాయి. స్వభావాన్ని బట్టి ఉపయోగించుకునే తీరు ఉంటుంది. ఉపయోగించుకునే తీరును బట్టి ఫలితం ఉంటుంది. అది ఒకరికి మంచి ఫలితం కావచ్చు. మరొకరికి చెడు ఫలితం కూడా కావచ్చు.

అయితే ఈ సందర్భంగా నేను మరొక విషయం చెప్పదలచకున్నాను. హిందూ ధర్మంలో ఉన్నటువంటి మరొక అద్భుతమైన విషయం 'కర్మ సిద్ధాంతం'. ఈ సిద్ధాంతం ప్రకారం "ఒకరికి మంచి చేస్తే మనకు మంచి జరుగుతుంది. ఒకరికి చెడు చేస్తే మనకు కూడా చెడు జరుగుతుంది" అనేది స్థిరమైన నమ్మకం. ఈ విషయం ఎన్నో సార్లు ఎంతోమందికి అనుభవపూర్వకంగా తెలుసు.

ఆ భయం వల్ల కూడా చాలావరకు ఎవరికైనా చెడు చేయటానికి సాధారణ పౌరులు భయపడతారు. అలా కూడా సమాజం చాలావరకు నైతిక సమతౌల్యతని కోల్పోకుండా మనగలుగుతున్నది.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఊహించని అవకాశాలు లభిస్తాయి. మిత్రుల నుంచి ధన లాభం పొందుతారు. వృత్తి, వ్యాపారాలకు అనుకూలంగా ఉంటుంది. ఆరోగ్యం, వాహనాల పట్ల మెలకువ అవసరం. వస్తు లాభం పొందుతారు. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి ఏర్పడుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

## వృషభం



ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. చర్చా గోష్టులలో చురుకుగా పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. నూతన వస్తు, వస్త్ర, వాహన అమ్మకాలు-కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. పక్షులకి నీళ్ల పెట్టండి. వృత్తి వ్యాపారాల్లో ఆటంకాలు తొలగిపోతాయి. మిత్రులు, బంధువుల నుండి శుభ వార్తలు వింటారు. క్రయ-విక్రయాలు లాభదాయకం.

## మిథునం



కొత్త కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేస్తారు. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. సన్నిహితుల ద్వారా విలువైన సమాచారం అందుతుంది. బంధు, మిత్రులతో ఆనందంగా గడుపుతారు. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి.

## కర్కాటకం



సన్నిహితులతో ఏర్పడిన విభేదాలు పరిష్కార మవుతాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి. విదేశాల్లో వున్నవారికి సొంతింటి కల నెరవేరుతుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. అందరితో వ్యక్తిగత విషయాలు చర్చించవద్దు. పక్షులకి నీళ్ల పెట్టండి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

## సింహం



చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనా ఆటంకాలు తొలగుతాయి. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. తగాదాలకు దూరంగా ఉండటం మంచిది. అనుకోని అవకాశాలు లభిస్తాయి. నూతన పరిచయాల ద్వారా విద్య, ఉద్యోగానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం లభిస్తుంది. పుస్తకాలు, మీడియా పట్ల ఆకర్షణ కలిగి వుంటారు.

## కన్య



దీర్ఘకాలిక ఆశయాలను నెరవేర్చుకోవడానికి కీలక స్థానాల్లో ఉన్న వ్యక్తులతో సంభాషణలు సాగిస్తారు. శత్రువర్గం బలహీనతలు తెలుసుకొని నేర్పుగా వ్యవహరిస్తారు. శివాలయాల్లో సెనగలు ఇవ్వడం మంచిది. కుటుంబ వాతావరణం ఉత్సాహపూరితంగా ఉంటుంది. ఉన్నత స్థాయి వ్యక్తులతో స్నేహాలు మరింత బలపరచుకునే యత్నాలు చేస్తారు.

## తుల



దేవాలయాలు సందర్శిస్తారు. కార్యాలయంలో అధికారుల మెప్పు పొందుతారు. నేర్పుగా వ్యవహరించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. భవిష్యత్తు బంగారు బాటగా కనిపిస్తుంది. వ్యాపార లావాదేవీలు బాగుంటాయి. పొదుపు పథకాలు పాటిస్తారు. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దలకు కావలసిన అవసరాలు సకాలంలో తీర్చి, మానసిక ప్రశాంతత పొందుతారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి.

## వృశ్చికం



సహనం అధికంగా కలిగి ఉంటారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. శ్రమకు తగిన ప్రతిఫలం అందుకుంటారు. కుక్కలకి చపాతీలు తినిపించండి. నిపుణుల సలహాలు పాటించి లాభపడతారు. సమృద్ధికరమైన ఆర్థిక వనరులు సంతోషానికి కారణం అవుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి.

## ధనుస్సు



ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సంఘ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి ఉంటారు. వాళ్లకు విలువైన వస్తువులు, వస్త్రాలు బహుమతులుగా ఇవ్వాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఆ బొట్టును ధరించండి.

## మకరం



పలువురి మెప్పు పొందుతారు. దీర్ఘకాలిక ఆశయాలను దృష్టిలో ఉంచుకొని, నెమ్మదిగా ఆ దిశవైపు అడుగు వేయాలన్న ఆలోచనలు కలిసి వస్తాయి. స్నేహితుల సహాయం అందుకుంటారు. జీవిత భాగస్వామి పట్ల ప్రేమ అనురాగం కలిగి వుంటారు. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రయోజనాలు అందుకుంటారు. రాజకీయాలు ఆకర్షిస్తాయి.

## కుంభం




కార్యాలయంలో మీ ప్రతిపాదనలను ఏకగ్రీవంగా ఆమోదిస్తారు. పుస్తక పఠనం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ఆర్థికంగా బాగుంటుంది. పక్షులకు దాన వేయండి. సౌందర్య సాధనాల పట్ల ఆకర్షితులవుతారు. దూర ప్రాంతాల్లోని మిత్రులతో సంభాషణలు సాగిస్తారు. బ్యాంకు లావాదేవీలు పరిశీలించుకుంటారు. ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి.


## మీనం




వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల పరంగా సందర్భోచితమైన నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. శుభ సమాచారం అందుకుంటారు. మీ శ్రమకు అదృష్టం తోడవుతుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. సంతాన పురోగతి బాగుంటుంది. క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తారు. ఆధ్యాత్మిక ప్రసంగాల పట్ల ఆకర్షితులవుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

# ఈ వారం కా‘ర్టూన్స్’


జ్వరం బాగా వుంది.. వదులుగా బట్టలు వేసుకుని శరీరానికి బాగా గాలి తగిలేలా చూసుకో!..
Zakir..


అమెరికాలో ఓట్లంటే ఇక్కడ మనకు బీరూ బిర్యానీ ఇవ్వరు.. బాగా అలవాటయ్యింది.. ఎదవ!!
Zakir...


అన్ని పెళ్ళిళ్ళ గురించి మాట్లాడేసినట్లే... "ఈ పెళ్ళి" నాలుగురోజులు నిలవదు అని చెప్తే.. బొక్కలో వేసారు!!
Zakir...


ప్రపంచంలో
ఎత్తయిన సహజసిద్ధ కమాన్
ఇది. దీనిని ది ఆర్చ్ ఆఫ్ టైమ్
అంటారు. ఇది మెక్సికోలో ఉంది. దీని
మధ్యలోంచి నది ప్రవహిస్తూ
ఉంటుంది. ఈ కమాన్‌ను అద్భుత
భౌగోళిక వింతగా యునెస్కో
గుర్తించింది.